Follow: @ANNTELUGU

05-05-2025

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 153 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ అమరుల స్మారకం ఆవిష్కరణకు రెండేళ్లు

ఇప్పటికీ సందర్శకులను అనుమతించని పరిస్థితి

మ్యూజియం ఏర్పాటుకు చర్యలు శూన్యం

పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తి చేయాలి

వివరాలు 6లో

**టాప్ న్యూస్**

### 16న అమెరికాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి
- ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు



02

### తెలంగాణ హైకోర్టు జడ్జి గిరిజా ప్రియదర్శిని మృతి

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స
- పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం



02

### కొంచెం ఓపిక పట్టండి..

- మారణహోమం ముందుంది..
- రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు



02



### లక్నోపై సూపర్ విక్టరీ..

- 37 పరుగుల తేడాతో పంజాబ్ గెలుపు
- ప్లే ఆఫ్స్‌కు చేరువలో పంజాబ్

వివరాలు 8లో

# స్థానికం ఫిక్స్!

స్థానిక సంస్థలకు ఎన్నికలు జులైలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుల గణన కారణంగా ఎన్నికలు వాయిదా పడినప్పటికీ, నిధుల కొరతతో ప్రభుత్వం నష్టపోతున్నందున ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. బీసీ నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని చెప్పగా.. వారు కూడా సమ్మతించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చిహ్నాల ఖరారు, బ్యాలెట్ పత్రాల ముద్రణ వంటి ముందస్తు ఏర్పాట్లను కూడా ఎన్నికల సంఘం పూర్తి చేసింది.



## స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులతో సీఎం చర్చలు

జులైలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా:** ఇప్పటికే పదవీ కాలం ముగిసిన గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రెండు నెలల క్రితమే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసినప్పటికీ, కుల గణన, బీసీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియతో స్థానిక ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ నియామకాల్లో విడివిడిగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీ తీర్మాన చేసి కేంద్రం ఆమోదం కోసం పంపింది. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. ఈ సంవత్సరం చివరిలో జన గణన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జనాభా సర్వే పూర్తి కావడానికి కనీసం రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. కాబట్టి, ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం 1,500 కోట్లు నష్టపోతుంది. కేంద్రం కుల గణనపై ప్రకటనతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి ఎన్నికల గురించి చర్చించారు. పాలక మండళ్లు లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోందని వివరించారు. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలిపారు.

మిగతా 2లో



## నడిరోడ్డుపై కారులో మంటలు

### ఉప్పల్ నుంచి తార్నాక వరకు ట్రాఫిక్ జామ్!

**హైదరాబాద్, మహా:** ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళ్తున్న ఓ కారులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో రహదారి మధ్యలోనే కారు ఆగిపోయింది. కారులో నుంచి మంటలు రావడంతో కంగారుపడిపోయిన ప్రయాణికులు హుటాహుటిన బయటకు వచ్చేశారు. దీంతో వారు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. కాగా, ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. నడిరోడ్డుపై కారు కాలిపోవడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉప్పల్ నుంచి తార్నాక వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ వద్ద ఉన్న ఎస్‌బీఐ భవనంలోని నాలుగో అంతస్తులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. దీంతో బ్యాంకుకు సంబంధించిన కీలక పత్రాలు మంటల్లో కాలిపోతున్నాయి. కాగా, ఫైర్ యాక్సిడెంట్ గురించి తెలియగానే హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మూడు ఫైరింజన్ల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.



### మీరు ఒక్క క్షిపణి దాడి చేశారు.. ఇక మేమేంటో చూపిస్తాం...

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహూ స్ట్రాంగ్ వార్నింగ్

వివరాలు 2లో

## ప్రపంచ యాత్రికుడు అన్వేష్‌పై కేసు

**హైదరాబాద్, క్రైమ్:** ప్రముఖ యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేష్‌పై సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలంగాణ డీజీపీతో పాటు పలువురు ప్రముఖులపై తప్పుడు వ్యాఖ్యలు చేశాడనే అభియోగం అతనిపై నమోదు అయినట్లు సమాచారం. ప్రపంచ దేశాలన్నీ చుట్టేస్తూ.. తెగ ఎంజాయ్ చేసేస్తూ.. ఆ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ పాపులారిటీతో పాటు డబ్బులు సంపాదించుకుంటున్నాడు అన్వేష్. అయితే.. తాజాగా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం పేరుతో.. తెలంగాణ డీజీపీ జితేందర్, మెట్రో ఎండీ ఎన్వీ ఎస్‌రెడ్డి, ఐఏఎస్ అధికారులు

మిగతా 2లో





### పాకిస్థాన్ మొత్తం అప్పు ఎంతో తెలుసా..?

వివరాలు 2లో

## మావోయిస్టులతో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్

### కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్:** మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. తుపాకీ వీడనంత వరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు అని స్పష్టం చేశారు. మావోయిస్టులతో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ..'మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు. తుపాకీ చేతపట్టి అమాయకులను పొట్టనపెట్టుకున్నోళ్లతో చర్చలు ఉండవ్. మావోయిస్టులను నిషేధించిందే కాంగ్రెస్. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ సహా ఎంతో మంది నాయకులను మందుపాతరలు పెట్టి చంపినోళ్లు నక్సల్స్. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల



నెపంతో అన్యాయంగా కాల్చి చంపి ఎన్నో కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చినోళ్లు మావోయిస్టులు.

మిగతా 2లో



### అమెరికా వద్దు.. ఆస్ట్రేలియానే ముద్దు

విదేశీ విద్య దేశాలలో ఆస్ట్రేలియాది ఇప్పుడు అగ్రస్థానం

IDP ఎడ్యుకేషన్ సర్వే ప్రకారం అమెరికాను వెనక్కి నెట్టి ఆస్ట్రేలియా అగ్రస్థానం

వివరాలు 2లో

## రాష్ట్రంలో రెజ్లింగ్ పోటీలను బలోపేతం చేస్తాం

### తెలంగాణ క్రీడా చైర్మన్ శివసేన రెడ్డి



**బండ్లగూడ:** రాష్ట్రంలో రెజ్లింగ్ పోటీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ క్రీడా చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌లో నిర్వహించారు. ఇందులో అండర్ 17 కేటగిరీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువతీయువకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, మహిళల రెజ్లింగ్ అనే మూడు కేటగిరీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెజ్లింగ్ పోటీలకు ఎంతో ఆదరణ ఉందని తెలిపారు. తెలంగాణ ఆమెచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు వెళ్లేవారికి వన్‌వే ప్రయాణ ఖర్చులను భరించడానికి చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

### తెలుగు హీరోతో మృణాల్ ప్రేమ? నిజమేంటి?

వివరాలు 8లో



## తెలంగాణ హైకోర్టు జడ్జి గిరిజాప్రియదర్శిని మృతి

### అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స

### పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం

**హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు జడ్జి గిరిజాప్రియదర్శిని మృతిచెందారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్లోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. 2022 మార్చిలో ఆమె తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె మృతిపట్ల న్యాయమూర్తులు, న్యాయవాదులు, పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం ప్రకటిస్తున్నారు.



## 16న అమెరికాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి

### ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు

**హైదరాబాద్:** ఈ నెల 16న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు వెళ్లనున్నారు. తమ కుమారుని గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి కవిత దంపతులు హాజరుకానున్నారు. విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆమె ఈ నెల 16 నుంచి 23 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. తమ కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నెల 16వ తేదీన అమెరికాకు బయలుదేరి.. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. ఈ విదేశీ పర్యటనకు అనుమతినిస్తూ.. ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రపంచ యాత్రికుడు అన్వేష్‌పై కేసు



(మొదటిపేజీ తరువాయి)

శాంతికుమారి, దాన కిశోర్, వికాస్‌రాజు తదితరులు రూ.300 కోట్లు కొట్టేశారంటూ ఓ వీడియో ద్వారా అతను వ్యాఖ్యలు చేశారట. అయితే అన్వేష్ అవాస్తవ, తప్పుడు సమాచారం ప్రచారం చేశారంటూ పోలీసులు సుమోటోగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అధికారులు, చట్టబద్ధమైన సంస్థల ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు.. పరువుకు భంగం కలిగించేలా వీడియో ఉంది. అధికారుల విశ్వసనీయతను దెబ్బతీసేలా.. ప్రభుత్వం మీద వ్యతిరేకత, ద్వేషాన్ని కలిగించేలా ఆ వీడియో ఉంది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేలా వీడియో చేసిన కంటెంట్ క్రియేటర్ అన్వేష్ మీద చర్యలు తీసుకోవాలి అని సైబర్‌క్రైమ్ ఠాణా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ పోలీసులు అన్వేష్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై అన్వేష్ ఎలా స్పందిస్తాడో చూడాలి.

## కొంచెం ఓపిక పట్టండి.. మారణహోమం ముందుంది

### రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు



**మహా:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ భారతావని భావిస్తున్న తరుణంలో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.' కొంచెం ఓపిక పట్టండి.. భారత్ లోని ప్రజలు కోరుకున్నదే జరుగుతుంది. దేశంపై కన్నెత్తి చూసిన వాళ్లకు గట్టి గుణపాఠం చెబుతాం. అసలైన దాడులు జరిగేందుకు కొంచెం ఓపికతో ప్రజలు ఉండాలి' అని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సంస్కృతి జాగరన్ మహోత్సవ్ సమావేశంలో రాజ్ నాథ్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. ఈ క్రమంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంకోసం సైనికులు ప్రాణాలు అర్పించారు. మన దేశాన్ని రక్షించుకుంటూ వచ్చారు. పెద్దలు, మత పెద్దలు, గురువులు మన ఆధ్యాత్మికతను కాపాడారు. సైనికులు రణభూమిపై పోరాడారు. ఆధ్యాత్మిక గురువులు జీవనభూమిపై పోరాడారు. రక్షణమంత్రిగా అటు సైనికులను, ఇటు ప్రజలను కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది. నా దేశంపై దాడికి పాల్పడిన వారికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత కూడా నాదే. ప్రధాని నరేంద్ర మోదీ పనితనం మీకందరికీ తెలిసిందే. ఆయన పట్టుదల, సామర్థ్యం మనకు తెలుసు. ప్రధాని మోదీ తన లైఫ్ లో ఎన్ని రిస్క్ లు చేశారో చూశారు. ప్రధాని మోదీ సారథ్యంలో మీరు ఏం కోరుకుంటున్నారో అది జరగబోతోంది. కొంచెం ఓపిక పట్టండి.. అని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. అధికార వర్గాలతో ప్రధాని మోదీ.. భేటీ అవుతుండటం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. తాజాగా వైమానిక దళం చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. పాకిస్థాన్ విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే సింధూ జలాల రద్దుతోపాటు, వీసాల జారీ రద్దు, అటారీ వాఘా బోర్డర్ మూసివేత, ఎగుమతులు, దిగుమతులు నిలిపివేత, పాకిస్థాన్ కు నీరు నిలిపివేత కారణంగా పాకిస్థాన్ సంక్షోభాన్ని అనుభవిస్తోంది. అటు ప్రపంచదేశాలు కూడా పాకిస్థాన్ వైఖరిపై తీవ్రంగా స్పందించాయి.

## స్థానికం ఫిక్స్ !

(మొదటిపేజీ తరువాయి)

కుల గణన పూర్తయ్యే వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా వేచి ఉండలేమన్న సీఎం అభిప్రాయంతో చాలా మంది నాయకులు ఏకీభవించారు. తెలంగాణలో కుల గణనకు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదని, ఎన్నికలకు వెళ్లవచ్చని రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు కూడా బీసీ నాయకులు అంగీకరించారు. కాకపోతే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం టిక్కెట్ల హామీ ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, చిహ్నాలను ఖరారు చేయడం మరియు రాష్ట్రంలో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం వంటి ముందస్తు ఎన్నికల కసరత్తులను రాష్ట్ర ఎన్నిక సంఘం ఇప్పటికే పూర్తి చేసింది. ఫిబ్రవరిలోనే మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా ఎన్నికల అధికారులను కూడా కోరింది.

## మీరు ఒక్క క్షిపణి దాడి చేశారు.. ఇక మేమేంటో చూపిస్తాం

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహూ స్ట్రాంగ్ వార్నింగ్



**టెల్ అవీవ్:** తమ దేశంపై హౌతీ రెబల్స్ చేసిన క్షిపణ దాడికి అంతకుమించి ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇక తాము ఏంటో చూపిస్తామంటూ హౌతీ తిరుగుబాటుదారులను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. ' మీరు ఒక క్షిపణి దాడిని మాపై ప్రయోగించారు. దానికి ప్రతీకారం ఎలా ఉంటుందో ఇక నుంచి చూస్తారు. మీరు చేసిన దాడుల కంటే ఏడు రెట్లు అధికంగా మా దాడి ఉంటుంది. గాజాలో ఉన్న పాలస్తీయుల పట్ల సానుభూతి నాటకంతో డ్రామాలు చేస్తున్నారు. మేము గతంలో మీపై యుద్ధం చేశాం. భవిష్యత్ లో కూడా చేస్తూనే ఉంటాం. మీలాగ ఒక్క దాడి కాదు. క్షిపణుల వర్షం కురిపిస్తాం. యూఎస్ తో సమన్వయం చేసకుంటూ ముందుకెళ్తాం. మేము, యూఎస్ కలిసి మిమ్మల్ని అంతమొందిస్తాం' అని మాట్లాడిన వీడియో 'ఎక్స్'లో పోస్ట్ చేశారు ఇజ్రాయిల్ ప్రధాని. కాగా, హౌతీ తిరుగుబాటు దారులు ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ మిస్సైల్‌తో విరుచుకుపడ్డారు. ఆదివారం. ఇజ్రాయిల్‌లో అతిపెద్ద విమానాశ్రయమైన టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్‌పైకి క్షిపణితో ఎటాక్ చేశారు. దీంతో ఒక్కసారిగా ఇజ్రాయిల్ ప్రజల్లో భయాందోళనలకు గురయ్యారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 నుంచి కేవలం 75 మీటర్ల దూరంలోనే క్షిపణి పడింది. మిస్సైల్ ధాటికి 25 మీటర్ల లోతైన భారీ గొయ్యి ఏర్పడింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇజ్రాయిల్‌కి ఉన్న శక్తివంతమైన నాలుగు అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను దాటుకుని క్షిపణి దాడి జరగడం సంచలనం కలిగిస్తోంది. క్షిపణి విమానాశ్రయం సమీపంలో పడకుండా అడ్డగించిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయని ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) తెలిపింది. ఒక్కసారిగా మిస్సైల్ దాడి జరగడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. ఈ దాడిలో 8 మంది గాయపడినట్లు ఇజ్రాయిల్ అధికారులు వెల్లడించారు.

## మావోయిస్టులతో మాటల్లేవు... మాట్లాడుకోవడాల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

తుపాకీ వీడనంత వరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు కేంద్ర కులగణన నిర్ణయం చారిత్రాత్మకం. ఇది కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరం. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణను పొంతనే ఉండదు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. బీసీల జనాభాను తగ్గించి చూపారు. కాంగ్రెస్ మాయమాటలను జనం నమ్మడం లేదు. ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకే కాంగ్రెస్ డ్రామాలాడుతోంది. పాస్ పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నాం. రోహింగ్యాలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలి. శాంతి భద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినా చర్యలెందుకు తీసుకోవడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే. ఆ రెండు పార్టీలు సిగ్గు లేకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని పోటీలు పడుతున్నారు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



## పాకిస్థాన్ మొత్తం అప్పు ఎంతో తెలుసా..?

**మహా:** ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోన్న దేశంగా పాకిస్థాన్‌కు ప్రపంచంలో బహు గొప్ప పేరే ఉంది. బరాక్ ఒబామా పాలనలో యూఎస్ ఆర్మీ 2011లో అల్‌ఖైదా నాయకుడు బిన్‌లాడెన్‌ను పాకిస్థాన్‌లోని అబత్తాబాద్‌లో చంపేశారు. మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ తమకు తెలియకుండానే అక్కడ తలదాచుకున్నాడని అప్పట్లోనే పాక్ ప్రపంచ దేశాల చెవిలో పూలు పెట్టేందుకు ప్రయత్నించింది. పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందనే ముసుగును తొలగించుకునేందుకు ఎనాడూ ఎలాంటి ప్రయత్నం చేయలేదు. అక్కడి ప్రజలైనా ఆర్థికంగా, సామాజికంగా మెరుగువుతున్నారా అంటే దేశం అప్పులు భారీగా పెరుగుతున్నాయి. ఇదే అదనుగా చైనా అధిక వడ్డీలకు పాక్‌కు అప్పులిచ్చి, తనకు భవిష్యత్తులో అవసరమయ్యే మౌలిక సదుపాయాలను మాత్రం అభివృద్ధి చేస్తోంది. దీన్ని పాక్ గ్రహించినా చేసేదేమిలేక మిన్నకుండిపోతుంది. పాక్ అప్పుల చిట్టా రూ.లక్షల కోట్లకు పెరిగింది. పాకిస్థాన్ మొత్తం రుణం పాక్ రూపాయి(పీకేఆర్)ల్లో 70.36 ట్రిలియన్లకు (భారత కరెన్సీలో సుమారు రూ.21.15 లక్షల కోట్లు) చేరింది. ఇందులో దేశీయ, ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన అప్పులు రెండూ ఉన్నాయి. వీటిలో గణనీయమైన భాగం చైనాకు చెందినవే. పాక్ మొత్తం అప్పుల్లో సుమారు 22 శాతం చైనా సమకూర్చినవే కావడం గమనార్హం.

**పాక్ విదేశీ రుణం:**

130 బిలియన్ డాలర్లు(సుమారు రూ.10.7 లక్షల కోట్లు).

**స్వల్పకాలిక విదేశీ చెల్లింపులు:**

వచ్చే ఏడాదిలో 30.6 బిలియన్ డాలర్లు(సుమారు రూ.2.53 లక్షల కోట్లు).

**రుణ-జీడీపీ నిష్పత్తి:**

ప్రభుత్వ ఆదాయంలో 5060% వడ్డీ చెల్లింపులకు ఖర్చు చేయడంతో 70% పైగా ఉంది.

**ఐఎంఎఫ్ బెయిలవుట్:**

ఐఎంఎఫ్ బెయిలవుట్ అనేది అధిక రుణం, కరెన్సీ అస్థిరత లేదా బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ సమస్యలు వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్న దేశాలకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అందించే ఆర్థిక సహాయ ప్యాకేజీ. ఈ బెయిలవుట్లు సాధారణంగా రుణాల రూపంలో వస్తాయి. అందుకు తరుచూ దేశం తన ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి కఠినమైన ఆర్థిక సంస్కరణలను అమలు చేయవలసి ఉంటుంది. అందులో భాగంగా గ్యాస్ టారిఫ్ పెంపు, కొత్త పన్నులు వంటి కఠిన షరతులతో 2023లో పాకిస్థాన్ 7 బిలియన్ డాలర్ల ఐఎంఎఫ్ బెయిలవుట్ ప్యాకేజీని పొందింది.

**విదేశీ నిల్వలు:**

2025 ఏప్రిల్ నాటికి 15.4 బిలియన్ డాలర్లు( రూ.1.27 లక్షల కోట్లు). ఇది మూడు నెలల దిగుమతులకు సరిపోదు.

**సైనిక వ్యయంపై ప్రభావం:**

పెరుగుతున్న అప్పుల కారణంగా పాకిస్థాన్ సైన్యానికి అందించే రేషన్‌ను తగ్గించింది. ఇంధన కొరత కారణంగా సైనిక విన్యాసాలను రద్దు చేయవలసి వచ్చింది.



### ఆర్థిక సవాళ్లు

**పాకిస్థాన్ నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా దిగుమతులను భారత్ నిలిపివేయడంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత కుదేలైంది. ప్రస్తుతం పాకిస్థాన్ రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే రూ.281గా ఉంది. ఇది రాబోయే రోజుల్లో రూ.400కు పడిపోతుందనే భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవలి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ సాయాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది. పరిమిత విదేశీ నిల్వలు, పెరుగుతున్న తిరిగి చెల్లించే అప్పలతో పాకిస్థాన్ రుణ సంక్షోభం తీవ్రమవుతోంది.**



## కవితకు తెలియకుండానే మనసులో మాట బయటకు వచ్చింది

**హైదరాబాద్:** తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సామాజిక తెలంగాణ అంటూ కొత్త రాగం తీసుకుందని ధ్వజమెత్తారు సీనియర్ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికారం పోయిన తర్వాత చాలా పెద్ద పెద్ద మాటలు కవిత మాట్లాడుతుంది. ఇవన్నీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకులేవా?, మీ తండ్రి సీఎంగా ఉన్నప్పుడు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా?, అధికారం పోగానే సామాజిక తెలంగాణ గుర్తుకు వచ్చిందా?' అంటూ మండిపడ్డారు జగ్గారెడ్డి. రాహుల్ గాంధీ నాయకత్వంలో, సీఎం రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక ప్రజా పరిపాలన కొనసాగుతుందని, తెలంగాణలో గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛను తెలంగాణ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఆ స్వేచ్ఛలోనే కవిత గొంతు కూడా మాట్లాడుతుందన్నారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని, నటించడం కవిత కుటుంబానికే సాధ్యమని, కేసీఆర్ ది నటనతో కూడిన పాలన అని, కాంగ్రెస్ ప్రభుత్వంది ప్రజా పాలన అని స్పష్టం చేశారు. 'ఎవరికైనా నష్టం జరిగిదే... స్వేచ్ఛగా ఇందిరాపార్కు దగ్గర నిరసన చేసే స్వేచ్ఛ కాంగ్రెస్ ఇచ్చింది. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోరుకున్నారు. అందుకే మా ప్రభుత్వం స్వేచ్ఛ ను ఇచ్చింది. ఇందిరాపార్కు మాత్రమే కాదు... ఏ జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లినా నిరసన చేసే స్వేచ్ఛ ఇచ్చింది. సామాజిక తెలంగాణ కోరుకుంటే.. కులగణన చేసి సామాజిక తెలంగాణ సాధిస్తున్నాం. కొత్త సెలబస్ తో తెలంగాణ ప్రజలను మోసం చేసేలా మీ ప్రకటన ఉంది.

## అమెరికా వద్దు.. ఆస్ట్రేలియానే ముద్దు

### విదేశీ విద్య దేశాలలో ఆస్ట్రేలియాది ఇప్పుడు అగ్రస్థానం

### IDP ఎడ్యుకేషన్ సర్వే ప్రకారం అమెరికాను వెనక్కి నెట్టి ఆస్ట్రేలియా అగ్రస్థానం



**మహా:** అభ్యసించడానికి ఎంచుకుంటున్న దేశాల జాబితాలో ఆస్ట్రేలియా ఇప్పుడు అగ్రస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ విద్యా సేవల సంస్థ IDP ఎడ్యుకేషన్ మార్చి 2025లో నిర్వహించిన సర్వే ప్రకారం.., అమెరికాను వెనక్కి నెట్టి ఆస్ట్రేలియా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అదే సమయంలో కెనడా ప్రజాదరణ మరింత క్షీణించింది. సర్వేలో పాల్గొన్న భారతీయ విద్యార్థుల్లో 28% మంది ఆస్ట్రేలియాను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో అమెరికా (22%) , యునైటెడ్ కింగ్‌డమ్ (UK) (21%) ఉన్నాయి. గత ఏడాది మార్చి (2024)తో పోలిస్తే కెనడా ఆరు శాతం పాయింట్లు తగ్గి కేవలం 13% వద్ద నిలిచింది.

'ఎమర్జింగ్ ఫ్యూచర్స్ సెవెన్ వాయిస్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ స్టూడెంట్' నివేదిక కోసం ప్రపంచవ్యాప్తంగా 6,000 మందికి పైగా విద్యార్థుల అభిప్రాయాలు సేకరించగా, వారిలో సుమారు 1,400 మంది భారతీయులే ఉన్నారు. ఆస్ట్రేలియా ప్రజాదరణ పెరగడానికి ప్రధాన కారణాలుగా దాని విశ్వవిద్యాలయాల మెరుగైన ప్రపంచ ర్యాంకింగ్‌లు (QS వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2025లో టాప్ 200లో 15 ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి) , ఆస్ట్రేలియాభారతదేశ ఆర్థిక సహకారం .. వాణిజ్య ఒప్పందం (AIECTA) ద్వారా లభించిన పోస్ట్‌స్టడీ వర్క్ పర్మిట్ కాల పరిమితి పెంపును నివేదిక పేర్కొంది.

అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులకు ఒక మంచి ఎంపికగా నిలుస్తోంది. 22% మంది దీనిని మొదటి ఎంపికగా భావిస్తున్నారు. అక్కడి విద్యా ప్రమాణాలు, ఉద్యోగ అవకాశాలు.. పోస్ట్‌స్టడీ వర్క్ వీసా విధానాలను విద్యార్థులు ఇప్పటికీ విలువైనవిగా పరిగణిస్తున్నారు. ఆస్ట్రేలియా, అమెరికా అగ్రస్థానాల్లో ఉన్నప్పటికీ ఆర్థిక అంశాలు భారతీయ విద్యార్థుల నిర్ణయాలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో మూడింట రెండు వంతుల (66%) మందికి ఖర్చు అతి పెద్ద ఆందోళనగా ఉంది, ఆ తర్వాత వీసా సమస్యలు (47%) ప్రధానంగా ఉన్నాయి. ట్యూషన్ ఫీజులు మరియు పొదుపు అవసరాలు వంటి ఆర్థిక అంశాలు రోజురోజుకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయి. స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉంటే (55%), లేదా పార్ట్ టైమ్ పని అవకాశాలు ఉంటే (54%) తమ అధ్యయన గమ్యస్థానాన్ని మార్చుకుంటామని సగానికి పైగా భారతీయ విద్యార్థులు తెలిపారు.

ఇతర ముఖ్యమైన సవాళ్లలో గృహ ఖర్చులు (43%) మరియు పార్ట్ టైమ్ ఉద్యోగాలతో పాటు చదువులను నిర్వహించడం (39%) ఉన్నాయి. అయినప్పటికీ, విదేశాల్లో చదువుకోవడానికి భారతీయ విద్యార్థులకు ప్రధాన ప్రేరణ వారి కెరీర్ అభివృద్ధి. సర్వే ప్రకారం, 77% మంది తమ ఉపాధి అవకాశాలను మరియు ఆదాయ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అంతర్జాతీయ విద్యను ఎంచుకుంటున్నారు.




# అవ్వండి స్మార్ట్ మహా డైలీ తో.






మహా డైలీ

Scan to Read

SUBSCRIBE

www.mahaadaily.com

https://epaper.mahaadaily.com/

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 05-05-2025
సాహిత్యం LITERATURE 04

# ఒకానొక కార్మిక పద్యం

నోరు తెరిచి అడగంది
అమ్మయినా అన్నం పెట్టదు

నీ చేతిలో మొబైల్ ఉంటే చాలు
ఆరామ్ కుర్చీలో కూర్చొని
స్విగ్గీ జొమాటో యాప్ కు
ఆర్డర్ చేయడమే ఆలస్యం

వేడివేడిగా నీ నూరూరించే పదార్థాలతో
నిమిషాల్లో నీ ఇంటి తలుపు తడతాడు
నీ డైనింగ్ టేబుల్ పైన
పంచభక్ష్య పరమాన్నమై అమ్మలా
అతడు దర్శనమిస్తాడు

ఇంట్లో గ్యాస్ పొయ్యి వెలిగించాల్సిన
పని నీకసలు లేదు
అన్నం ఉడుకాల్సిన అవసరం లేదు
ఉప్పూ కారం వేసి
కూరలు రుచిగా వండాల్సింది లేదు

కారు మోటార్ సైకిల్ లేకున్నా పర్వాలేదు
నీవు ఎక్కడికి ప్రయాణం చేయాలనుకున్నా
బుక్ చేసుడు ఆలస్యం
ఇంటి ముందు కోరుకున్న
ఓలా ఊబర్ షేరింగ్ రాపిడో వాహనం
ఒకటి వచ్చి నిన్ను గమ్యానికి చేర్చుతుంది

కిరాణం గ్రోసరీ ఆన్ లైన్లో షాపింగ్
ఏదైనా ఎప్పుడైనా ఎక్కడికైనా
క్షణాల్లో డోర్ డెలివరీ అవుతుంది

నీకూ డెలివరీ బాయ్ కీ
ఏ బంధుత్వమూ ఉండదు
చదివిన చదువుకు చేస్తున్న పనికి
ఎటువంటి రక్త సంబంధం ఉండదు

వ్యవసాయ ఉద్యోగ రంగాల్లో
సంక్షోభం ఉక్కిరి బిక్కిరి చేస్తున్నప్పుడు
ఉపాధి కోసం కనీస హక్కులు లేని
డెలివరీ బాయ్ అవుతాడు

కంపెనీ యజమానికి
స్వంత కార్లు ఉండవు
బైక్ లు ఉండవు కానీ
మూడుపువ్వులూ ఆరు కాయలుగా
లాభాల పంట పండిస్తాడు

నువ్వు ఇచ్చే స్టార్ రేటింగ్ కై
నీ వంక ఆశగా ఎదురుచూస్తాడు

మళ్లీ ఒక ఆర్డర్ కోసం
జీవితంలోని అన్ని బార్డర్లను దాటి వచ్చి
సేవల ప్లాట్ ఫారం యాప్ పిలుపులో
ఉపాధిని వెతుక్కునే
అతడు హళ్లీకి హళ్లీ
సున్నాకు సున్నా కూలీ

ఎల్లప్పుడూ సేవలో నిమగ్నమయ్యే
నిశ్శబ్ద వేదనను చెవి వొగ్గి విందాం
అతని పేరు ఏదైనా కావచ్చు
ప్రస్తుతానికతన్ని గిగ్ వర్కర్ అందాం



-జూకంటి జగన్నాథం
సెల్:94410 78095

విస్మృత బీసీ సాహిత్యం

# ధిక్కార స్వరం పెద్దిదాసు

భాగవత కర్త బమ్మెర పోతనామాత్యులు తన రచనను రాజులకు అంకితమివ్వ నిరాకరిస్తూ 'ఇమ్మనుజేశ్వరాధములకు' అని నిరసించిండు. అట్లా నిరసించినందుకు ఆయనకు ఇబ్బందేమీ కలుగలేదు. అయితే రాజాశ్రయాలను ధిక్కరించి పలు ఇబ్బందులకు గురైన పదకర్త పెద్దదాసు. తన వ్యక్తిగత స్వేచ్ఛను నిరాకరించిన రాజులను ఊరకుక్కలని నిందించిండు. అదీ ఎంతోమంది కవి పండితులను తన ఆస్థానంలో పోషించిన విజయ రంగనాథుని గురించి చెప్పిండు. పెద్దదాసు తంజావూరు రాజు విజయరంగనాథుని సమకాలీకుడు. 1633 నుంచి 1673 వరకు పాలకుడిగా ఉన్న ఈ నాయక రాజు స్వయంగా కవి. తన తండ్రి చరిత్రను 'రఘునాథ నాయకాభ్యుదయము' అనే ద్విపద కావ్యంగా రాసిండు. అట్లాగే '23 యక్షగానాలు, 3 ద్విపద కావ్యాలు, గోపికా గీతాలు, భ్రమర గీతాలు, ఫాల్గుణోత్సవ రగడ, చౌపదినీ రాజగోపాల దండకమూ' రచించినాడు. ఈయన రంగాజమ్మ మొదలు క్షేత్రయ్య వరకు అనేకమంది కవి పండిత కళాకారులను, పదకర్తలను ఆదరించినాడు. అయితే విజయరంగనాథ నాయకుడు తన సహజ పండితాదరణ గుణానికి భిన్నంగా పెద్దదాసు అనే పదకర్తను అవమాన పరిచిండు. హేళన చేసిండు. రాజాజ్ఞను ధిక్కరించినందుకు కొరడాలతో కొట్టించిండు. ఆ విషయమే ఇప్పుడిక్కడ చర్చించుకుందాం.

గాజుల బలిజ కులంలో పుట్టిన పెద్దదాసు ఇంతకుముందే చెప్పుకున్నట్లు విజయరంగనాయకుడి సమకాలీకుడు. సంగీత సాహిత్యాలపై పట్టున్న పండితుడు. స్వయంగా రచనలు చేసిండు. ఆడిపాడిరదు. తంజావూరు మన్నారుదాస భక్తుడు. వైష్ణవాన్ని ప్రచారం చేసిండు. జ్ఞానవేత్త, తత్త్వ బోధకుడు. ఇట్లాంటి పెద్దదాసు గాన విశిష్టతను, రచనా ప్రతిభను విన్నటువంటి విజయరంగనాథుడు తన ఆస్థానానికి పిలిపిస్తాడు. దీనికి పెద్దదాసు

"పామరుల జెంతజేరము శ్రీరామ నామమే నమ్మినారము
ఈ మహి సంసార హీనులతో చెల్మి సేయక
శ్రీహర శరణు జొచ్చి యున్నాము" అంటూ రాజసభకు రావడానికి నిరాకరిస్తాడు. దీంతో ఆగ్రహించిన రాజు బలవంతంగా తన సంస్థానానికి పెద్దదాసుని పట్టి తెప్పిస్తాడు. తెప్పించి తన గురించి, తన పూర్వీకుల గురించి, తంజావూరు రాజ్య వైభవం గురించి పొగుడుతూ కీర్తనలు చెప్పుమని కోరగా

"నారసింహుని పాడిన నోటను
పూర సింహమును పాడన్
సారము గాదని సరగున బల్కెను
సాధు బృందములు వినగన్" అని నిండు సభలో రాజును ధిక్కరిస్తాడు. అంతేగాదు "తిరుమణి దాల్చిన పంచమ (దళిత) దాసులనైనను కీర్తించెదను గాని మానవనాథులను స్తోత్రము చేయను అని" చెప్పిండు. (నిడదవోలు వెంకటరావు దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము: పే.184). దీంతో ఆగ్రహించిన విజయరంగనాథుడు తన అనుచరులతో ఒక గాడిదకు పట్టెనామము తీర్చి దానికి దండము పెట్టుమని పెద్దదాసుని ఆదేశించిండు. దీనికి పెద్దదాసు ఏమాత్రం సంకోచించకుండా నామములు పెట్టిన గాడిద చుట్టూ ప్రదక్షిణ చేసి దానికి సాష్టాంగ నమస్కారము చేసినాడు. "గాడిదకు దండము పెట్టిన గాడిదవుకావా" అని నిందించి ప్రశ్నించినాఁడు. ఈ గాడిదె తిరుమణి దాల్చిన నీ వంటిదే. నీకు దండము పెట్టినపుడు గాడిదకు పెట్టుటలో తప్పేమున్నది" అని పెద్దదాసు ధిక్కార గొంతుకను, నిరసనను, ఆగ్రహాన్ని తెలిపిండు. దీంతో కోపగించిన రాజు పెద్దదాసుని కొరడాలతో కొట్టాలని భటులను, తలారిని ఆదేశిస్తాడు. ఇక్కడ కొంత నమ్మశక్యంగాని విషయాలు కూడా చరిత్రలో రికార్డయినాయి. పెద్దదాసు "తలారివైపు తేటిపాటి చూడగానే కొరడా భస్మీభూతమయిందనీ రాసిం(డు." ఈ కొఅత వద్ద పెద్దదాసు ఈ కింది కీర్తన చెప్పినాడని నిడదవోలు వెంకటరావుగారు రాసినారు.

"ఇదిగోవేళ, వేణుగోపాలా
నామది గర్వమెంచక, మన్నించి రక్షింపు
మదన జనక, తంజాపురీ సదన గోపాలా" అని
కీర్తనతో హరినామస్మరణ చేసినాడు.
పెద్దదాసుని రక్షణకొరకు గోపాలుడు వైష్ణవ భక్తుని వేషముతో వచ్చి
"దాసుని మిక్కిలి దండిస్తివి రా ధగిడీ
నాదాసులనక్కట దండిస్తివిరాధగిడీ" అని కొరడాతో రాజుని దండిరచడంతో ఆ దెబ్బలకు తాళలేక రంగనాథుడు 'పెద్దదాసుని విముక్తి చేసిండని సింగరిదాసు రాసిన 16 పేజీల 'పెద్దదాసు చరిత్రము' చెబుతున్నది. నిడదవోలు వెంకటరావు తన దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయచరిత్ర (1960)లో కొన్ని పెద్దదాసు పదాలను పేర్కొన్నాడు. అవి ఇలా ఉన్నాయి.

"కొలిచితేను వేణుగోపాలుని కొలువవలెను
వ్రాసితే నీమముతో రామకోటి వ్రాయు
చుండవలెను
పాడితే జగన్నాథునిపై పాట బాడవలెను
ఆడితే పురుషోత్తముని కొనియాడుచుండవలెను" (హరి ఆదిశేషువు జానపద గేయ వాఙ్మయము, 1954:పే. 191) అని నియమం చేసుకున్నాడు.

కొరడా దెబ్బలకు తాళలేక రాజు వెంటనే తలారి దగ్గరికి వెళ్లి శిక్షను ఆపించి, పెద్దిదాసుకు క్షమాపణలు చెప్పుకున్నాడు. అంతేగాకుండా మంగళతూర్యా రావములతో నా పెద్దిదాసును ఊరేగించారు. చివరికి పెద్దిదాసు శ్రీరంగములో మరణించాడు.

తంజావూరులో గాజుల శేషాచల శెట్టి, భాగీరథికిని జన్మించిన పెద్దదాసు (పెద్దదాసరి అని బాలాంత్రపు రజనీకాంతరావు రాసినారు) కొన్ని రోజులు కుల వృత్తి అయిన గాజుల మలారం భుజాన వేసుకొని స్త్రీల చేతులకు గాజులు వేసే పనిచేసిండు. అయితే కాసులపై ఆసక్తి లేకపోవడంతో ఆ వ్యాపారం ముందుకు సాగలేదు. నష్టాలు సంభవించినాయి. దీనితో ఆ పనిని వదులుకున్నాడు. అందుకే గాజుల వృత్తిపై ఇట్లా చెప్పుకున్నాడు.

"కాసుల నడుగకను ఘనమున దొడగెను
భూసుర స్త్రీలకు పుణ్యాంగనలకు
భక్తి వినయమున
భగవద్దాసుడు వేంకట విఠలు
వేమరు దలచుచు"
కులవృత్తి గాజుల మలారం పనిచేయాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేయడంతో యువకుడైన పెద్దదాసు కొన్నినాళ్లు ఆ వ్యాపారము చేసిండు. "గాజుల వేపారము జేసెను పెద్దిదాసుడు" అనే కీర్తన ద్వారా ఈ విషయం విదితమవుతుంది.
నిడదవోలు వెంకటరావు పేర్కొన్న పెద్దదాసు కీర్తన ఒకటి ఇలా ఉన్నది.
నాదనామక్రియ `ఆదితాళము
పల్లవి: కొంచాన దొరకదు శ్రీహరి స్మరణ వంచనమతి జనులకు
అనుపల్లవి: హెచ్చుమించు నారాయణకథలు సచ్చరితము విన సైపని వారికి
చరణములు: పరనిందా పరధనములు రోసీ పరభామల బాసీ
అరిషడ్వర్గము లంటఁగఁజేసే మూఁడాశల రోసీ సరసిజ నాథుని పరమభక్తులెడ
కొఱతలు మోఱిగే కుక్కను దినవలె. ॥కొం॥
మందమౌ మోహము పోగొట్టవలెను సుజ్ఞానము చేతన
యింద్రియములచే పట్టవలెను ముదమున గెంటవలెను
నిందను పలికే పందిని దినవలె. ॥కొం॥
లోన వెలుపట సరియై యుండవలెను
నానా కర్మలు శ్రీనాథునకు ప్రీతి సేయవలెను
దీనుల కిడవలెను శ్రీశుమించి
శ్రీ వేంకటవిఠలుని
ధ్యానము సేయని యేనుఁగు దినవలె ॥కొం॥
ఇట్లా అనేక కీర్తనలు రాసి ఆనాటి పండితశ్రేణిలో అగ్రగణ్యుడిగా గౌరవం పొందిండు.



డా. సంగిశెట్టి శ్రీనివాస్

ఆఖరికి పెద్దదాసు శాపము మూలంగానే తంజావూరు నాయక రాజ్యం మరాఠీల చేతిలో నాశనమైంది కూడా 'పెద్దిదాసు చరిత్రము'లో పేర్కొన్నారు. మల్లాది వసుంధర తన 'తంజావూరు పతనం' నవలలో ఈ విషయాన్ని కొంత చర్చించినప్పటికీ నవలకు అనుగుణంగా పెద్దదాసుని బ్రాహ్మణుడిగా వర్ణించింది. అట్లాగే కెవి రమణారెడ్డి గారు 1958లో విశాలాంధ్ర పత్రికలో 'పెద్దిదాసు' పేరిట ఒక కథను రాసిండు. ఇందులో పెద్దిదాసు ధిక్కారాన్ని కొనియాడిరదు. ఇట్లా సాహిత్యంలో భిన్న కోణాల్లో ఆవిష్కరింప బడ్డప్పటికీ సాహిత్య చరిత్రలో పెద్దిదాసుకు స్థానము దక్కలేదు. ఇప్పటికైనా ఆ లోటు పూరించాల్సిన అవసరమున్నది. ఏది ఏమైనా చదువు, పాండిత్యం, సంగీతం, పద సంకీర్తనలు అన్నీ బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమైన కాలములో పై అన్ని విషయాల్లో అగ్రశ్రేణి విద్వాంసుడిగా నిలిచినవాడు పెద్దదాసు. రాజాశ్రయాలను నిరాకరించడమే గాదు, రాజులను ధిక్కరించాడు. పామరజన రంజితంగా భగవద్ ప్రార్థనలు, కీర్తనలు చేసి అధ్యాత్మిక రంగంలో రాణించారు. ఇప్పటికైనా పండితులు ఈయన కీర్తనలు సేకరించి వాటిని పాడిరచి రసజ్ఞులైన శ్రోతలకు అందుబాటులో తేవాల్సిన అవసరమున్నది. అలాగే ఆయన జీవిత చరిత్రను, కీర్తనలు, పదాలను అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసుల మాదిరిగా పాఠకులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరమున్నది.

# మా ఊరొక కావ్యం

## ఆటోబయోగ్రాఫికల్ లాంగ్ పోయెం

### "A VILLAGE IS A SYMPHONY OF NATURE AND HUMANITY"

బావిలోని నీరును
తోడినకొద్ది ఊరినట్లుగా
బాల్యం కూడా ఒక ఊటబావినే
తడియారని చెలిమేనేకదా....

అంటూ ప్రముఖకవి గోపగాని రవీందర్ గారు తన ఊరు చెలెమేలోంచి దోసిళ్ళకొద్ది తీయటి ఆత్మకథనాత్మక బాల్యస్మృతుల్ని "మా ఊరొక కావ్యం" లో అద్భుతంగా ఆవిష్కరించారు. తనను వెంటాడే ఊరి జ్ఞాపకాలను ఇసుకరేణువుల్లో పోగొట్టుకున్న అనుభూతుల సమాహారాన్ని వెతుక్కునే పసిపిల్లాడై బాల్యపుఆటల్లో ఆరిపోనీ చెమ్మల్నితన గాఢమైనకవిత్వవాక్యాల్లో ముంచి బతుకు దెరువు కోసం ఊళ్లనుంచి నగరాలకొచ్చిన మనకి ఊళ్లతో పెనవేసుకున్న పేగుబంధాన్ని గుర్తు చేసి మనకళ్లను చెమ్మగిల్లేలా చేస్తాడు. "నా తత్వం నీ దేహమే" అనే కవితలో అప్పటితరం పిల్లలకు ఈతరం పిల్లల జీవితాల మధ్య ఏర్పడిన అంతరాల్ని, అగాధాల్నీ కాలంతో పాటు వచ్చిన మార్పుల్ని ఎలా juxtapose చేస్తాడో! చూడండి.

ఇప్పుడంటే పిల్లలందరూ /ఇంటిలోని గదులకే పరిమితం నిర్జీవమైన వస్తువులతో ఆడుతూ /పసితనానికి దూరం ... అని రాస్తూ... ఆ రోజుల్లో స్వేచ్ఛగా ఆడుకునే పిల్లలు ఎంత ఆనందంగా, హాయిగా, స్వేచ్ఛగా ఉండేవాళ్ళో..సాహసానికీ, సహవాసానికి కూడా మరోరూపమైన వాళ్ళ మనస్తత్వం, ధైర్యం, తెగువ గురించి ఇలా అంటారు. విశాలమైన ఆకాశ మైదానంలో /విహరించే పక్షుల్లా చెట్లు మావే ..చేమలు మావే /పుట్టలు మావే... గట్లు మావే కాయలు మావే... పళ్లుమావే /అగ్గిపెట్టెలోని బంగారు పురుగులు మావే అంటూ.... ఏ బాదరబంధీలేని బంగారం లాంటి జీవితాన్ని, వాళ్ళు చేసిన సాహసకృత్యాల్ని... ఏ భయం లేకుండా గడిపిన బాల్యాన్ని తన కవిత్వ పాదాల్లో నెమరేసుకుంటాడు.

నిజంగా ఊరంటే తడిఆరని బాల్యస్మృతులకు చిరునామాయే కాదు, సంతోషపు పూలవానల్లో తడిసిన అనుభూతుల్ని, దుఖపు ముళ్ళగాయాలు సలిపే బాధల్ని భరించే తెగువను నేర్పే మహాగురువు కూడా. ఇంకా చెప్పాలంటే ఈ అనంతజీవనప్రయాణంలో దృశ్యాదృశ్యంగా ఎదురయ్యే అవరోధాల్ని చాకచక్యంగా ఎదుర్కొనే మానసిక ధైర్యాన్నిచ్చే సహచరుడు కూడా.తన ఊరు గురించి ఎలా తలపోస్తాడో చూడండి...

ఊరంటే ఒకవలపోత /ఊరంటే జ్ఞాపకాల చెలిమి
ఊరంటే సలుపుతున్న గాయం /ఊరంటే ఒక ఊరడింపు
ఊరంటే ఒక సోపతిగాని అనురాగం /ఊరంటే తల్లి ఆత్మీయ స్పర్శ
అంటూ...

ఊరి గురించి ఎంత చెప్పుకున్నా ఒడవని ముచ్చటే! ఏంత రాసినా మిగిలిపోయే కావ్యమే! చివరి శ్వాస వరకు మన గుండెలోతుల్లోంచి అప్పుడప్పుడైనా తొంగి చూసే తీయని భావనే! అక్షరాలలో చెక్కలేని అదృశ్య శిల్పమే!... ఎప్పటికీ చెక్కిలిమీంచి జారిపడని ఆనందభాష్పసిందువే! అందుకే నా "రాత్రిసింఫని" సంపుటికి రాసుకున్న ముందుమాటలో "నా సాహిత్యానికి తల్లివేరు మా ఊరే" అని రాసుకున్న.

ఈ కవి తన గుండె గూట్లోంచి రంగురంగుల సీతాకొక చిలుకల్ని "పునర్దర్శన ప్రాప్తిరస్తు" అనే కవితలో ఎలా ఎగరేస్తారో చూడండి..
పుస్తకంలోని పేజీల నడుమ దాచుకున్న/అపూర్వమైన అందమైన నెమలీకలా..
ఆకాశంలో తారల మధ్యన /వెలుగుతున్న చందమామలా
పూలవనంలో విహరిస్తున్న /రంగురంగుల సీతాకోకచిలుకలా




విశాలంగా పరుచుకున్న సంద్రం నుండి /వడివడిగా ఉర్కలేస్తున్న కేరటంలా
నా గుండెలో మబ్బు తునకలా /గూడుకట్టుకుంది మా ఊరు.

ఊరంటే సకలశాస్త్రాల్ని నేర్పే విశ్వవిద్యాలయమే కాదు ఆధిపత్యంపై ఎగసే ధిక్కార స్వరం కూడా అంటూ అమృతధారల వంటి జ్ఞాపకాలని, అనురాగపు జల్లుల్లో తడిసిన రోజుల్ని తన కవితావాక్యాల్లో తడిమి చూసుకుంటాడు. పల్లెటూరినుంచి వచ్చిన ఏ కవికైన తన ఊరొక నోస్టాల్జియా. కన్నతల్లి గురించి, సొంత ఊరి గురించి పలవరించి కవిత్వం రాయని కవి ఎంత రాసినా అది అసంపూర్ణమే. అందుకే "మమకారానికి ప్రతిరూపం" అనే కవితలో తన తొలిగురువైన తల్లి శాంతవ్వ తనకు పంచిన ప్రేమానురాగాల్ని ఇలా glorify చేస్తాడు...
మాట కరుకు మనసు వెన్న తలవంచని జీవన గమనంతో
నిత్యం పాఠాలు భోధించే నాకే /కొత్త పాఠంలా కనిపించే అమ్మకు వందనాలు...!

ఏ కవైనా మామూలుగా తన ఊరు జ్ఞాపకాల్ని తలపోసుకుంటూ ఒకటి రెండు కవితల్ని రాస్తారు. కానీ, తనకు జన్మభూమే కాక కవిగా పునర్జన్మ నిచ్చిన తన ఊరిమీదున్న మమకారాన్ని 35 కవిత్వాకాశాల్లో పరిచి తిమ్మాపురం(హవేలి)కి మాహాకావ్య గౌరవం తీసుకొచ్చి మనందర్ని ఆఊరి కవిత్వదారుల్లో తిప్పుతాడు. ఒక కవి ఒకే వస్తువు మీద ఇన్ని కవితల్ని రాయడం సాహసమే కాక అన్ని కవితల్ని అంతే బలమైన వాక్యనిర్మాణంతో పాఠకుని గుండెల్ని కవిత్వానుభూతి నింపడం ఈకవి యొక్క సృజన కౌశలానికి ముగ్ధులం కావాల్సిందే. ఇంతకు ముందు కూడా కొంతమంది కవులు తమ ఊళ్ళ గురించి కవిత్వ సంపుటీలను వెలువరించారు. ఆ సంపుటీల సరసన సాధికారికంగా చేర్చదగిన కవిత్వసంపుటి ఇది.

ఆంగ్లసాహిత్యంలో ఎందరోకవులు ఊళ్ళ మీద కవిత్వం రాసి ఆ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. 19వ శతాబ్దపు ప్రఖ్యాత ఆంగ్లకవి John Clare తానొక వ్యవసాయ కూలిగా పనిచేస్తున్న రోజువారి అనుభవాల్ని, ఇంగ్లాండ్ లోని గ్రామీణ ప్రాంతాల పచ్చటి మైదానాల్ని, మొక్కల్ని, రకరకాల పక్షుల్ని అద్భుతంగా కవిత్వం చేశాడు. ఆయన రాసిన "All Nature has a Feeling" అనే కవితలో ప్రకృతి యొక్క అజరామరమైన శక్తిని ఈ క్రింది పాదాల్లో చూడండి.

All nature has a feeling: woods, fields, brooks
Are life eternal: and in silence they
Speak happiness beyond the reach of books;
There's nothing mortal in them; their decay
Is the green life of change; to pass away
And come again in blooms revivified.

ఇంకా William Wordsworth, Robert Frost, Oliver Gold Smith లాంటి ప్రపంచ ప్రఖ్యాత కవులు కూడా వాళ్ళ గ్రామీణ జీవనానుభవాల్ని పేరెన్నికగన్న కవిత్వంగా అక్షరీకరించి తమ తరువాతి తరం కవులకు మార్గదర్శకంగా నిలిచారు. రవీందర్ కూడా తన ఊరి ముఖ చిత్రాన్నే కాక ఆ ఊరిలోని ఆ కాలపు అనుబంధాల్ని, మానవ సంబంధాల్ని సహస్రవృత్తుల సమస్త చిహ్నాల్ని అలవోకగా ఎటువంటి obscurity కానీ complexity గాని లేకుండా తన గుండెలోతుల్లోని మధురానుభూతుల్ని మన మనసుల్లోకి వొలుకుతాడు. "మహానుబావులు" అనే కవితలో..
కొందరిని చూస్తే చాలు /అలలు అలలుగా ఎగిసిపడుతున్న
సముద్రాన్ని చూసినట్టుంది /కొందరితో మాట్లాడుతుంటే చాలు
ఉత్తేజాన్నిచ్చే గొప్ప పుస్తకాల్ని /చదివినట్టుంటుంది అంటూ...

తన జ్ఞానదాహన్ని తీర్చిన ఏకశిలాయూత్ అసోసియేషన్ అండ్ లైబ్రరీజ్ఞాపకాలను గుర్తుచేసుకుంటాడు. బడుగు, బలహీన వర్గ ప్రజల గురించే కాక సామాజిక చైతన్యగీతాలతో ప్రజలు చైతన్యవంతులైన రోజుల్ని, వాలీబాల్ పోటీల్లో, బాట్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయిలో మెరిసి తమ ఊరి పేరును క్రీడా ప్రపంచపటంలో కీర్తింపచేసిన కల్లెపు సురేందర్,యాకయ్యా లాంటి అద్భుత క్రీడాకారుల్ని తన కవితల్లో వర్ణిస్తాడు. చిన్నప్పుడు తనకు అట్లాస్ సైకిల్ అంటే ఎంత ప్రియమో "సహవాసి" అనే కవితలో గుర్తుచేసుకొని మురిసిపోతాడు.
భూగోళాన్ని అట్లాస్ పటాల్లో/చూసి మురిసిపోయిన నాకు అట్లాస్ పై వెళుతుంటే /ప్రపంచాన్ని జయించినట్లుగా ఉండేదని ....
సైకల్ తనకు నిత్యజీవితంలో అడుగడుగునా సహాయం చేసిన ఒక తోబుట్టువులాంటిదని personify చేస్తూ...అట్లాస్సైకిల్తోతనకున్నఅనుబంధాన్ని,అనుభూతుల్నిపచ్చనిపైరులాంటిజ్ఞాపకాల్నినెమరేసుకోవటమేకాక మనందరి బాల్యజ్ఞాపకాల్ని స్మరణకు తెస్తాడు. మన సాహిత్యంలోని సాహిత్యకారులు గ్రామాల్లో పుట్టి పెరిగి ఉద్యోగరీత్యా నగరాల్లో, పట్టణాల్లో స్థిరపడ్డవాళ్లు, తమ గ్రామ జీవిత అనుభవాల గురించి కవిత్వాన్ని, కథల్ని సృజిస్తే తెలుగు సాహిత్యం ఇంకా సుసంపన్నం అవుతుంది. ఈ కావ్యాన్ని ఒక ఒడవని ముచ్చటగా కవితాగానం చేస్తున్న రవీందర్ గారిని హృదయ పూర్వకంగా అభినందిస్తు.. మరి కావ్యం చదివి ఎంతమంది కవిత్వమై ప్రవహిస్తరో! వేచి చూడాలి మరి.



- డా. బాణాల శ్రీనివాసరావు ,
9440471423

# స్వప్నం

*******

అందాలన్నీ మెట్లబావి నీటివే
సౌందర్యమే చెమట విచ్చే వాసన
నిద్రరాని నిద్రలేని కలలో పూసింది

పైనుండి ధీరునిలా
నీటిలో అడుగుపడే గొప్ప విన్యాసం
బాల్యం దాటేసిన కౌమారకేళి రోజులదే

మెట్లు వంతెన దాటించే యుద్ధంలో
భూమీ నీరు బాయి కలిసే
ఈత కూడ మెదడుకు మేతే

అజేయుడు ఆడే నేలదే ఆట కదా
మెట్లబావి యాతన ఆటగానిదే
నవ్వే చూపులకు అందమే క్రీడ
రక్తమోడే పాదాల గాయమే కనిపించని స్వప్నం

బాధ ఒకటి ఎదురొచ్చి
రక్తపాదాలను ముద్దాడిన దృశ్యం
మానవీయ మనిషిదే ఖచ్చితంగా



- డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

# రోగం ఎరగని వైద్యం!

మన నగరానిది
ఏమదృష్టమో
మూసీ కల నెరవేరక ముందే
ప్రపంచ అందాల పోటీకి వేదికైంది!

ప్రపంచ సుందరీమణులు
చారిత్రక నగరంలో కాలు మోపితే
నగరం ఆకలి దప్పులు మరిచిపోతదట
ఆ చర్మవ్యాపారానికి మురిసిపోతదట!

దేశ సరిహద్దులు ఒకవైపు
తొడలు చరుచుకుంటుంటే
అందాల ఆరబోత కనువిందు చేయడం
మన భాగ్యనగరం మహాత్భాగ్యమట!

పొద్దెరుగని
బిచ్చగాళ్ళ కాలమిది
స్త్రీ సౌందర్యాన్ని వ్యాపారాత్మకం చేస్తే
రాజ్యంలో నాట్యం ఆడేది దారిద్ర్యమే!

ప్రజల కన్నీళ్లు తుడవని
ప్రసంగాలు ఏవైనా ప్రగల్భాలే
రోగం ఎరుగని వైద్యం
ఏనాటికైనా ప్రాణాంతకమే!!



- కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261

# రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

# పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# ఘనంగా భగీరథ జయంతి వేడుకలు




**కాటారం, మహా :** మహర్షి భగీరథ సేవా దృక్పథం మరియు ప్రజల పట్ల ఉన్న బాధ్యతా భావాన్ని మన జీవితాల్లో అలవర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మహర్షి భగీరథ ఆశయాలను నేటి సమాజంలో అమలుపరచుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని ఆమె పేర్కొన్నారు. ఆదివారం భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి నిర్వహించారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అథిగా పాల్గొని భగీరథ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథ సేవలను స్మరించుకున్నారు. ప్రాచీన భారత ఋషుల గొప్ప చరిత్రలో మహర్షి భగీరథుని స్థానం ప్రత్యేకమైనది. ఆయన మహాతపస్విగా, ప్రజల క్షేమం కోసం గంగా నదిని భూలోకానికి తీసుకురావడంలో చేసిన అశ్రాంత ప్రయాసల ఫలితంగా ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. మహర్షి భగీరథ నిశ్చల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన వ్యక్తిత్వం, ప్రతి పౌరునికీ స్ఫూర్తిదాయకం. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి క్రాంతి కిరణ్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, సగర సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి సత్యవతి కృష్ణ, సగర యువజన సంఘము జిల్లా అధ్యక్షులు హేమంత్, బిసి సంఘము బాధ్యులు సత్యనారాయణ,కార్యాలయ సిబ్బంది మరియు వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు





**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వగ్రామమైన ధన్వాడలో వారి కుటుంబంచే నిర్మితమైన శ్రీ దత్తాత్రేయ దేవాలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. 32 మంది వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మహోత్తరమైన పూజలు, వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు మెమెంటో ఇచ్చి శాలువాతో సన్మానం చేశారు. ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం దత్తాత్రేయుని దేవాలయంలో పుణ్యాహవాచనము గణపతి పూజ 54 ప్రత్యేక కలశములు ఏర్పాటు చేసి మూలవిరాట్ దత్తాత్రేయ స్వామికి అభిషేకము, పంచామృతాభిషేకము, పుష్పార్చన, దత్త హోమము నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలన్నీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేకంగా నిర్వహించారు. దేవాలయ పురోహితులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్ శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు దత్తాత్రేయుని దైవ దర్శనం చేసుకొన్నారు. భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమకు మూడు సౌకర్యం కోసం గృహాలు మంజూరు చేయాలని ఇతర సమస్యల పైన ప్రజలు మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దశలవారీగా ఇల్లు లేని వారందరికీ ఇళ్ల నిర్మాణం చేపడతామని ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా కల్పించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరికి గృహాలు మంజూరు కావని అనహరులకు ఇల్లు మంజూరు అయితే వేటు వేస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు కు చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# వికలాంగుల అభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

## న్యాయం కోసం... మే 13న డైరెక్టర్ కార్యాలయం ముట్టడి

### ప్రభుత్వ ఉద్యోగాల్లో రోస్టర్ 10లోపు మార్చాలి

### ఎన్పిఆర్డి రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది వికలాంగులు న్యాయ హక్కుల కోసం పోరాడుతున్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పి ఆర్ డి), రాష్ట్రస్థాయి పిలుపు మేరకు మే 13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు రంగారెడ్డి జిల్లా వికలాంగుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భుజంగారెడ్డి మాట్లాడుతూ... వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ 10లోపే ఉండేలా మార్చాలని, వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 10.48 లక్షల మంది వికలాంగులుండగా, కేవలం 4,90,044 మందికే పెన్షన్లు లభిస్తున్నాయి. ఆర్పిడబ్ల్యుడి చట్టం (2016), మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ (2017) అమలులో విఫలమవుతున్నట్టు వేదిక పేర్కొంది. వికలాంగులపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, మహిళా వికలాంగుల రక్షణపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో స్పెషల్ విద్యా సంస్థలు లేకపోవడం వల్ల చాలా మంది వికలాంగ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలవ్వడం లేదని, వికలాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని రూ.2 లక్షలకు పెంచాలని, ఇద్దరు వికలాంగులు పెళ్లి చేసుకుంటే రూ.5 లక్షల ప్రోత్సాహకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోటారైజ్డ్ వాహనాలు, పరికరాల పంపిణీ, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. ప్రతి మండలంలో భవిత్ సెంటర్లు ఏర్పాటు చేసి, మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్ హెచ్ సి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తీవ్ర వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ రూ.25,000 ఇవ్వాలని వేదిక డిమాండ్ చేసింది. వికలాంగుల సమస్యలపై ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రేషన్ కార్డులపై గుడ్ న్యూస్

## ఆన్లైన్లోనే పేరు నమోదు చేసుకునే ప్రక్రియ.. కొత్త పేర్లు చేరుస్తున్న సర్కారు

### గత పదేళ్లలో లేని వెసులుబాటును కల్పించిన కాంగ్రెస్ సర్కారు.. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల్లో సంతోషం




**వరంగల్ మహా;** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డుల కోసం పదేళ్లుగా ప్రజలు ఎదురు చూసారు. కనీసం తమ కుటుంబ సభ్యుల పేరు నమోదుకు అవకాశం కూడా గత ప్రభుత్వం కల్పించలేదు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్న వారు కాగితాల పైనే కాలం గడిచి పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రేవంత్ సర్కార్ కొత్త రేషన్ కార్డుల జారీ పై దృష్టి సారించడంతోపాటు రేషన్ కార్డుదారుల పిల్లలు, వేరే రాష్ట్రాల నుంచి తిరిగి తెలంగాణకు వచ్చేసిన వారు, ఇప్పటివరకూ తమ పేర్లను చేర్చుకోని వారిని ఇప్పుడు చేర్చుతున్నారు. దీని వల్ల కొత్త రేషన్ కార్డు రాకపోయినా పాత రేషన్ కార్డులో పేరును చేర్పించుకొని లబ్ది పొందే వీలు కలు గుతుంది. నిజానికి ఈ నిర్ణయం 8 ఏళ్ల కిందటే తీసుకోవాల్సింది. అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం అలా చెయ్యలేదు. రెండోసారి అధికారంలోకి వచ్చాక కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పని చెయ్యలేదు. దీంతో తమ పేర్లను కూడా రేషన్ కార్డులలో చేర్చమని దాదాపు 6 లక్షల మంది అప్పటినుంచి అడుగుతూ ఉన్నారు. కానీ వారి ఆశలు తీరలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను గమనించి, పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది. రేషన్కార్డుల్లో కొత్త వారు తమ పేర్లను చేర్పించడానికి ప్రభుత్వం ఒక మార్గాన్ని చూపించింది. ఆన్లైన్ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుంది. రేషన్కార్డుల్లో తమ పేర్లను చేర్చుకోవాలని ఆల్రెడీ ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం చూస్తున్నారు. కానీ అవి వెంటనే వచ్చేలా లేవు. దీంతో ఈ క్రమంలోనే ప్రజలకు ఊరటనిచ్చేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికైతే పాత రేషన్ కార్డులలోనే కొత్త సభ్యుల పేర్లను చేర్చాలని నిర్ణయించింది. వారి పేర్లను పరిశీలించి లబ్దిదారుల జాబితాలో చేర్చేందుకు ఒక్కొక్కటిగా దరఖాస్తును ఆమోది స్తున్నారు. ఇలా తమకు వచ్చిన దరఖాస్తుల్లో 20 శాతం దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించా మనీ, కొత్తగా లిస్టులో చేరిన వారి పేరు మీద నెల కోటా బియ్యం కూడా తీసుకుంటున్నారని ప్రభుత్వం చెబుతోంది.

### అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు పెరిగిన రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందజేస్తామని స్పష్టం చేశారు.



# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

**వరంగల్, మహా;** జిల్లాలోని మామూనూరు జవహర్ నవోదయ విద్యలయ పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. మొత్తం 240 మంది గాను 237 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ముగ్గురు అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. నీట్ పరీక్షకు హాజరైన అభ్యర్థుల హాజరు శాతం 98.75గా నమోదయింది. జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించిన ఈ పరీక్ష మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్, మహా;** తెలంగాణ గ్రామీణ దేవాలయాలకు అందించబడుతున్న ధూప దీప నైవేద్యం పథకానికి దరఖాస్తులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ పథకం కింద అర్హత కలిగిన ఆలయాలకు నెలకు రూ.4 వేలు నైవేద్యం కోసం, రూ.6 వేలు అర్చకునికి గౌరవ భృతి ఇవ్వనున్నట్లు మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తును endowments.ts.nic.in వెబ్ సైట్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 24వ తరీకు లోపు జిల్లా సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ కార్యాలయానికి సమర్పించాలన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్లా..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వివాహ శుభకార్యంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, ఆదివారం ఇమామ్ గూడా ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ లో రాకేష్ గౌడ్ విశ్వ సంజన వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన సిడబ్ల్యుసి కమిటీ సభ్యులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి, ఈ కార్యక్రమంలో అమంగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, నరసింహం, బిచ్య నాయక్, అజీమ్, చేకూరి వెంకటేష్, చెన్నకేశవులు,ఆరిఫ్, మల్లేష్, సత్యం, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బల్దియా ఇన్చార్జ్ ఎస్ఈ గా శ్రీనివాస్ నియామకం

**వరంగల్ మహా;** బల్దియా ఇన్చార్జ్ ఎస్ఈ గా శ్రీనివాస్ ను నియమించడం జరిగిందని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బల్దియా ఎస్ఈ గా కొనసాగిన ప్రవీణ్ చంద్ర ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ప్రభుత్వం నుంచి నూతన ఉత్తర్వులు వచ్చే వరకు సీనియర్ ఈ ఈ శ్రీనివాస్ ను ఎస్ గా నియమించారు. అదేవిధంగా ఈ ఈ మహేందర్ సెలవుల్లో ఉన్నందున ఆయన స్థానంలో ఈ ఈ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న మాధవికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు.

# మార్కెట్ యార్డ్ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**వరంగల్,మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్లో గల పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినట్లు తెలిపిన నేపథ్యంలో, మార్కెట్ లో అధికారులు, రైతులు తీసుకుంటున్న జాగ్రత్తలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావం నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు రైతులు టార్పాలిన్ కప్పి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి, పాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ధాన్యం నాణ్యత, రైతుల అవసరాలు, డబ్బు చెల్లింపులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలలో ప్యాడి క్లీనర్ లు, గన్ని బ్యాగులు, తాగునీరును అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలను, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటనే జరిగేలా అవసరమైన హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, కార్యదర్శి జి.రెడ్డి, తహసీల్దార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# అందని ద్రాక్షలా ఎల్ఆర్ఎస్ రాయితీ

## ముగిసిన రాయితీ గడువు

### ఫీజులు చెల్లించిన 30,500 మంది దరఖాస్తుదారులు

### జారీ చేయబడిన ప్రొసీడింగ్ లు కేవలం 3వేలు మాత్రమే



**వరంగల్, మహా;** ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా 25 కోట్లు గ్రేటర్ వరంగల్ లో వసులయ్యాయి. కాగా దరఖాస్తు దారులకు ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ వేల మందికి అందని ద్రాక్ష పండు వలె మిగిలింది. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో 1.03లక్షల మంది రూ.వెయ్యి రూపాయలను చెల్లించి ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారు. శనివారంతో రాయితీ గడువు ముగిసింది. ఇప్పటికీ వేల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్ లో ఉన్నాయి. దీనికి తోడు సాంకేతిక సమస్యలు తలనొప్పిగా మారాయి. అన్ని శాఖల వెరిఫికేషన్ పూర్తి చేసినప్పటికీ సైట్లో కొన్ని ఫైళ్లు కనిపించడం లేదు. ఇలా సుమారు 20 వేలకు పైగా దరఖాస్తుదారులు 25 శాతం రాయితీ అవకాశం కోల్పోయారు. గడువు ముగిసే సమయం వరకు గ్రేటర్ పరి ధిలో 30, 500 మంది దరఖాస్తుదారులు ఎల్ ఆర్ఎస్ ఫీజులు చెల్లించారు. వాటి ద్వారా కార్పొరేషన్ కు సుమారు రూ.128 కోట్ల ఆదాయం సమకూ రింది. ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు ప్రొసీడింగ్ ల జారీలో జాప్యం జరుగుతోందని ఇప్పటి వరకు కేవలం 3 వేల దరఖాస్తులకు మాత్రమే ప్రొసీడింగ్లు జారీ అయ్యాయి. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతూ ఏమీ చేయలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



# నీట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీపీ

**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో నీట్ పరీక్ష కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం సందర్శించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లతో పాటు అభ్యర్థులను తనిఖీ చేస్తున్న తీరును సీపీ పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ దేవేందర్ రెడ్డి, సత్య నారాయణతో పాటు స్థానిక ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, రవి కుమార్, నాగబాబు, మంగీలాల్ ఉన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ హక్కు మన అందరి

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తుర్కయంజాల్ మున్సిపాలిటీలో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి హాజరయ్యా. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని 10,11,12,వార్డుల్లో, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు,జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మహనీయుల అడుగుజాడలో నడవాలని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణ హక్కు మన అందరిదని ప్రజలకు, యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకుర్మ శివకుమార్, గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్, రాష్ట్ర సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ మంకాల దాసు, ముత్యాల రాజశేఖర్ రావు, సామ భీమ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కోషిక ఐలయ్య, కాకుమాను సునీల్, మేతరీ అనురాధ దర్శన్, గుండా భాగ్యమ్మ ధన్ రాజ్, పుల్లగుళ్ళం కీర్తన విజయానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నీట్ అభ్యర్థిని సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకువెళ్లిన బాలాపూర్ ఎస్సై శ్రీనివాస్

**బాలాపూర్ మహా:** కాంచన బాగ్ లోని డిఫెన్స్ లాబరేటరీ పరీక్ష కేంద్రం చేరుకోవాల్సిన నీట్ విద్యార్థిని తపుగా డిఫెన్స్ లాబరేటరీ స్కూల్ కు చేరుకోవడంతో మరొక సెంటర్ కు చేరుకున్నానని గమనించిన విద్యార్థిని అక్కడున్న అడిషనల్ డీసీపీ B V సత్యనారాయణ,ఏసీబీ మహేశ్వరం లక్ష్మీకాంత్ రెడ్డి, బాలాపూర్ సీఐ సుధాకర్ కు సమాచారం తెలియజేయడం తో బాలాపూర్ ఎస్సై శ్రీనివాస్ ఎస్కార్ట్ సహాయంతో పరీక్ష కేంద్రానికి సమయానికి చేర్చారు. కీలకమైన సమయం లో పోలీసుల అందించిన సహకారం తో సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకుంది. పోలీసులు అందించిన సహాయం తో తల్లిదండ్రుల,విద్యార్థిని పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణంలో ఎమ్మెల్యే

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరిగే శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవం బ్రాహ్మణపల్లిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళ్యాణానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆలయంలో స్వామివారికి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. స్వామివారి సేవలో కొద్దిసేపు గడిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు..



## యువత ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఎదగాలి

**బ్రూతల్ ఫైట్ క్లబ్ బాక్సింగ్ సెంటర్ ను ప్రారంభించిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి**

**బాలాపూర్ మహా:** చైతన్యపురి మెట్రో స్టేషన్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన బ్రూతల్ ఫైట్ క్లబ్ బాక్సింగ్ సెంటర్ ను ప్రారంభించిన మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి,టిపిసిసి మెంబర్,కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి. నాయకులు మాట్లాడుతూ... ఆరోగ్యంగా,మానసికంగా, శారీరకంగా,దృఢంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలను ఎంచుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు,తమ పిల్లలను అదో ఒక క్రీడారంగంలో ప్రోత్సహించాలని లక్ష్మారెడ్డి సూచించారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు పై ఆధారపడకుండా సొంత కాళ్ల పై నిలబడి వ్యాపారాలను ప్రారంభించి,ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా నేటి యువత ముందుకు రావడం ఆనందదాయకమని లక్ష్మారెడ్డి తెలిపారు. కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్ నాయకుల ఇలాంటి క్రీడల లో జాయిన్ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, వెంకటేశం తో పాటు మహేశ్వరం



మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి,ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి,కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి,ఆకుల శ్రీవాణి,బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి,రంగ నరసింహ గుప్త,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లంకి ధనరాజ్ గౌడ్, బేర బాలకృష్ణ,గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ డైరెక్టర్ మధుసూదన్ రావు,ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.





# నీట్ పరీక్ష ప్రశాంతం..

- పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాం
- 2914 మంది విద్యార్థుల హాజరు
- 61 మంది విద్యార్థులు గైర్హాజర్
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్
- నీట్ పరీక్ష కేంద్రాల సందర్శన

**కరీంనగర్, మహా:** జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని, ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ బైపాస్ రోడ్ లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ, ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో నీటి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు ఆయా చోట్ల ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.. ఏర్పాట్లు పకడ్బందీగా చేశారా.. ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా... పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారా... అని అధికారుల నుంచి కలెక్టర్ వివరాలు సేకరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ చేపట్టిన ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గదుల్లోకి వెళ్లి పరీక్ష తీరు.. వసతుల కల్పనను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 2975 మందికి 2914 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారని, 61 మంది విద్యార్థులు హాజరు కాలేదని పేర్కొన్నారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష జరిగిందని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. కలెక్టర్ వెంట నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, ఎస్ ఆర్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ కృష్ణ, తహసిల్దార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలన ..**

అదేవిధంగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ నీట్ పరీక్ష కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా వసతుల కల్పన.. విద్యార్థుల హాజరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. అన్ని వివరాలను తెలుసుకున్నారు. పోలీసుల భద్రత..విద్యార్థుల బయోమెట్రిక్, తనిఖీలు.. వివిధ అంశాలను కనుక్కున్నారు. ఎక్కడా ఏలాంటి తప్పిదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచించారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా సాగిందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.



## చనిపోయిన వ్యక్తి అంత్యక్రియల స్థలం కోసం 2,0000 రూపాయల డిమాండ్

**రాజేంద్రనగర్, మహా** కిషన్ బాగ్ లో నివాసం ఉంటున్న మైనారిటీ నాయకుడు చనిపోవడంతో అంత్యక్రియల కోసం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ మైనారిటీ స్మశాన వాటిక వద్దకు శనివారం తెల్లవారుజామున తీసుక వచ్చారు. చనిపోయిన వ్యక్తి అంత్యక్రియల కోసం 2,0000 రూపాయలను డిమాండ్ చేసిన స్మశాన వాటిక నిర్వాహకుడు ఖలీల్. చనిపోయిన వ్యక్తి బంధువుల వద్ద నుంచి 5వేల నగదు 15 వేల ఆన్లైన్ చేశారు. డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారని మాట మాట పెరగడంతో రాజేంద్రనగర్ పోలీసులకు చనిపోయిన వ్యక్తి బంధువులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు స్మశాన వాటికను చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్యాట్నీ సెంటర్ ఎస్‌బీఐ బిల్డింగ్‌లో భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్:** సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ లో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్యాట్నీ సెంటర్ ఎస్ బీఐ అడ్మిన్ బిల్డింగ్ లో అగ్ని ప్రమాదం జరిగింది. ఐదవ ఫ్లోర్ పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. దాంతో సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మూడు ఫైరింజన్ల సాయంతో అక్కడకు వచ్చి మంటలను అదుపు చేస్తున్నారు. అయితే మంటలు ఆర్పడం కష్టతరంగా మారుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. విలువైన ఫైల్స్ దగ్ధమౌతున్నట్లు సమాచారం. బిల్డింగ్ లో ఎవరైనా ఉన్నారా.. లేదా అనేది తెలియాల్సి ఉంది. ఆదివారం సెలవు కావడంతో పెను ప్రమాదం తప్పింది.

## ఇండియన్ రైల్వే కీలక ప్రకటన

**గెలిచినోళ్లకు రూ.5 లక్షల ప్రైజ్**

భారతదేశంలో రైల్వే స్టేషన్లలో కొత్త డిజిటల్ గడియారాలను రూపొందించడానికి ఇండియన్ రేల్వే దేశవ్యాప్తంగా ఒక పోటీ ప్రకటించింది. రైల్వే ప్లాట్‌ఫామ్‌లలో, స్టేషన్ ప్రాంగణాలలో ఉపయోగించే గడియారాలు ఒకే విధంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ పోటీలో పాల్గొనేవారిని ''ప్రొఫెషనల్స్, కళాశాల/విశ్వవిద్యాలయ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు (12వ తరగతి వరకు)'' అని మూడు వర్గాలుగా విభజించడం జరుగుతుంది. ఈ పోటీలో పాల్గొనేవారు తమ డిజైన్‌లను 2025 మే 1 నుంచి మే 31 మధ్య ఆన్‌లైన్‌లో (contest.pr@rb.railnet.gov.in) సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఈ పోటీ గురించి రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ 'దిలీప్ కుమార్' మాట్లాడుతూ.. గెలుపొందిన విజేతకు.. మొదటి బహుమతి రూ. 5 లక్షలు అందిస్తామని వెల్లడించారు. అంతే కాకుండా మూడు విభాగాలలో ఇదుమందికి కన్సోలేషన్ బహుమతులుగా రూ. 5000 చొప్పున ఇవ్వనున్నట్లు స్పష్టంగా చేశారు. ఈ పోటీలో పాల్గొనేవారు తమ డిజైన్లను.. హై రిజల్యూషన్‌లో, ఎలాంటి వాటర్ మార్క్ లేదా లోగో వంటివి లేకుండా, ఒరిజినాలిటీ సర్టిఫికెట్‌తో సబ్మిట్ చేయాలని దిలీప్ కుమార్ పేర్కొన్నారు. డిజైన్ వెనుక ఉన్న థీమ్.. ఆలోచనను వివరించే కాన్సెప్ట్ నోట్ కూడా ఉండాలి. మీరు సబ్మిట్ చేసే డిజైన్స్ అసలైనవిగా ఉండాలి, వాటిపై ఎలాంటి కాపీరైట్స్ ఉండకూడదని ఆయన వివరించారు.

## రెండు టీంలతో గ్రామ రెవెన్యూ సదస్సులు

**జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా కొందుర్గు మండలం**

**భూ భారతి గ్రామ రెవెన్యు సదస్సులు**

**కొందుర్గు మండలంలో 20 గ్రామాలు ఎంపిక**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూ భారతి గ్రామ రెవెన్యు సదస్సులు ఈనెల 5 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ రెవెన్యు సదస్సులో భాగంగా జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని , దీనికి సంబంధించి సదస్సులు నిర్వహించే చోట అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లకు పలు సూచనలు, సలహాలతో పాటు దిశా నిర్దేశం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ గా తీసుకోవడం జరిగిందనీ అన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు పైలెట్ లో రెండు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామానికి వెళ్ళే ముందు రోజు గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని, సంబంధిత అధికారులు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఉండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు.

అలాగే అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, 20 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసి అందుకనుగుణంగా పని చేయాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే హెల్ప్ డెస్క్, దరఖాస్తుల, రెవెన్యు సదస్సుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తులు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్ లో ఉన్న రైతులకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించడం జరుగుతుంది అని అన్నారు. హై కోర్టు అనుమతులు రాగానే 12102020 నుండి 1011 2020 వరకు పెండింగ్ లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణను పూర్తి చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ నెల చివరి వరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు.

## పార్కింగ్ చేసిన బైకు ను ఎత్తుకెళ్లిన దుండగులు

**పెట్రోలింగ్ పెంచాలని డిమాండ్ చేస్తున్నా స్థానికులు**

**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ డివిజన్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషను పరిధిలోని బుద్వేల్ రైల్వేస్టేషన్లో చాకలి సత్తయ్య బైక్ ను రాత్రి పార్కు చేయగా గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సిసి కెమెరాలు రికార్డు అయ్యాయి. అయితే గత ఏడాది నుండి వరుస దొంగతనాలు జరుగుతున్న పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని బుద్వేల్ బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




## అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్గా వై. అశోక్రెడ్డి

**ఆదివారం బాధ్యతలు స్వీకరణ**

**అబ్దుల్లాపూర్మెట్,మహా:** అబ్దుల్లాపూర్మెట్ నూతన ఇన్స్పెక్టర్గా వై. అశోక్రెడ్డి ఆదివారం బాధ్యత స్వీకరించారు. అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్గా పనిచేసిన బి. అంజిరెడ్డి సైబర్ క్రైమ్ పోలీస్స్టేషన్కు బదిలీ అయ్యారు. సైబర్ క్రైమ్లో విధులు నిర్వహిస్తున్న వై. అశోక్రెడ్డి అబ్దుల్లాపూర్మెట్ సీఐగా బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అబ్దుల్లాపూర్మెట్ పోలీస్స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల కోసం కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. మెరుగైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని సీఐ వై. అశోక్రెడ్డి తెలిపారు.

# తెలంగాణ అమరుల స్మారకం ఆవిష్కరణకు రెండేళ్లు

## ఇప్పటికీ సందర్శకులను అనుమతించని పరిస్థితి

**మ్యూజియం ఏర్పాటుకు చర్యలు శూన్యం.. పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తి చేయాలి**



**హైదరాబాద్:** అది ప్రత్యేక రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్మారక జ్యోతి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చారిత్రక కట్టడాన్ని ఆవిష్కరించి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి వరకు సందర్శకులకు అనుమతి లేకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా దీనిని ప్రారంభించింది. అమరుల మ్యూజియంతో పాటు మరికొన్ని పనులు వాయిదా పడ్డాయి. అలా పెండింగ్ జాబితాలో పడిపోయిన పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఫలితంగా సందర్శకులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. సెక్రటేరియట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించారు. కానీ.. తెలంగాణ అమరుల స్మారకానికి మాత్రం ఇంకా తుది మెరుగులే దిద్దలేదు. సందర్శకులను అనుమతించడం లేదు.

**ఆ దిశగా అడుగు పడలేదు..**

ప్రతిరోజూ వేలాది మంది పర్యాటకులు నెక్లెస్ రోడ్డుకు వస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో వేలాది మంది ట్యాంక్‌బండ్, లుంబిని పార్కు, ఎన్టీఆర్ పార్కు, అంబేద్కర్ విగ్రహం వంటి ప్రాంతాలను సందర్శిస్తాను. వీటితో పాటు అమరుల స్మారకాన్ని బయటి నుంచి వీక్షించాల్సిందే. కానీ.. ప్రాంగణంలోకి వెళ్లేందుకు అవకాశం లేదు. తొలి, మలి దశ ఉద్యమాల్లో అమరులైన వందలాది మంది జీవితాలను సమున్నతంగా ఎత్తిపట్టేలా మ్యూజియం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. తెలంగాణ ఉద్యమాలపై రూపొందించిన డాక్యుమెంటరీలను కూడా ఈ మ్యూజియంలో ప్రదర్శించేందుకు ప్రత్యేకమైన హాళ్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలపై ప్రత్యేకంగా ఒక గ్రంథాలయాన్ని సైతం ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటి వరకు ఈ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు.

**అలంకారప్రాయంగా జ్యోతి..**

హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రపంచంలోనే అపురూపమైన కళాఖండంగా నిలిచింది. ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో దీని నిర్మాణం చేపట్టారు. దుబాయ్‌లో ఎంతో పేరొందిన ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ ఈ స్మారకానికి మాత్రం ఎలాంటి అతుకులు లేకపోవడం విశేషం. 85000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.131 కోట్లతో గత ప్రభుత్వం దీన్ని నిర్మించింది. సందర్శకులు భవనంపై ఉన్న స్మారకజ్యోతి వరకు వెళ్లేందుకు అవకాశం ఉంది. అక్కడే ఒక రెస్టరెంట్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. ఇక భవనం రెండంతస్తుల్లో.. తెలంగాణ అమరవీరుల త్యాగాలను, వీరోచిత పోరాట గాథలను స్మరించుకునేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిత్రపటాలు, చారిత్రక చిహ్నాలను ఏర్పాటు చేయాలని భావించారు. ప్రేక్షకులు వీక్షించేందుకు లేదా విని తెలుసుకొనేందుకు వీలుగా ఆడియో, వీడియో హాళ్లు, గ్యాలరీలను కూడా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. మ్యూజియంలో అక్కడక్కడా కియోస్క్‌లు, టచ్ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి వాటిద్వారా కూడా తెలంగాణ ఉద్యమ చరిత్రను, విశేషాలను భవిష్యత్‌తరాలకు తెలియజేయాలని ప్రతిపాదించారు. పై అంతస్తులో కనీసం 600 మంది కూర్చొనేందుకు వీలైన కన్వెన్షన్ హాల్ కూడా ఉంది. సాహిత్య సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనువైన హాల్ ఇది. ఆర్ట్ గ్యాలరీలను కూడా ఏర్పాటు చేయవచ్చు. కాగా.. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. దీంతో స్మారక జ్యోతి అలంకారప్రాయంగానే ఉండిపోయింది.

**అంబేడ్కర్ మ్యూజియం తరహాలో ఏర్పాటు చేస్తే మేలు..**

ప్రస్తుతం అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వద్ద పార్లమెంట్ ఆకృతిలో ఉన్న వేదిక భవనంలో మ్యూజియం ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇదే తరహాలో తెలంగాణ అమరుల స్మారకం వద్ద మ్యూజియం ఏర్పాటు చేస్తే తక్కువ వ్యవధిలోనే సందర్శకులను అనుమతించేందుకు అవకాశం లభిస్తుంది. మరోవైపు ప్రభుత్వ సంస్థలకు ఆ బాధ్యతలను అప్పగించకుండా తెలంగాణ అమరుల స్మారకజ్యోతి, మ్యూజియం నిర్వహణకు స్వతంత్రంగా పని చేసే ఒక సొసైటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు ప్రతిపాదిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అమరుల త్యాగాలను, జ్ఞాపకాలను భావితరాలకు అందజేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.




# కంపెనీల కార్పొరేట్ ఫలితాలు ఎలా ఉన్నాయంటే..

## షాపర్స్‌స్టాప్ లాభం పతనం

రిటైల్ స్టోర్ల దిగ్గజం షాపర్స్‌స్టాప్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 91 శాతంపైగా పడిపోయి రూ. 2 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 23 కోట్లుపైగా ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 2 శాతం పుంజుకుని రూ. 1,064 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,046 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 4 శాతం పెరిగి రూ. 1,090 కోట్లకు చేరాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 86 శాతం క్షీణించి రూ. 11 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 77 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 7 శాతం వృద్ధితో రూ. 4,628 కోట్లకు చేరింది.

### ఈక్విటాస్ లాభం పతనం

ప్రయివేట్ రంగ సంస్థ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(ఎస్ఎఫ్‌బీ) గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 80 శాతం క్షీణించి రూ. 42 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 208 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,685 కోట్ల నుంచి రూ. 1,869 కోట్లకు ఎగసింది. ప్రొవిజన్లు రూ. 107 కోట్ల నుంచి రూ. 258 కోట్లకు భారీగా పెరిగాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.61 శాతం నుంచి 2.89 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 1.17 శాతం నుంచి 0.98 శాతానికి తగ్గాయి.

### లాటెంట్ వ్యూ అనలిటిక్స్ నికరలాభం రూ.51 కోట్లు

డిజిటల్ అనలిటిక్స్ కన్సల్టింగ్ అండ్ సొల్యూషన్స్ ప్రొవైడర్ లాటెంట్ వ్యూ అనలిటిక్స్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.51.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు 2023–24 ఇదే క్వార్టర్‌లో నికరలాభం రూ.45.23 కోట్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ.187.45 కోట్ల నుంచి రూ.253.29 కోట్లకు పెరిగింది. "త్రైమాసిక ప్రాతిపదికన 1.9%, వార్షిక ప్రాతిపదికన 35.3 శాతం పెరుగుదలతో వరుసగా తొమ్మిదో సారి ఆదాయం వృద్ధి సాధించడం సంతోషంగా ఉంది. బలమైన వ్యాపార మూలాలు, క్లయింట్లతో సత్సంబంధాలు మా స్థిరమైన పనితీరుకు నిదర్శనం" అని కంపెనీ సీఈవో రాజన్ సేతురామన్ తెలిపారు. 2025 మార్చి 31తో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం రూ.173.49 కోట్లు, మొత్తం ఆదాయం రూ. 916.78 కోట్లుగా ప్రకటించింది.

# ధీరూభాయ్ అంబానీ అసలు పేరేంటో తెలుసా?



భారదేశంలో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ.. రిలయన్స్ సామ్రాజ్యం గురించి తెలిసిన దాదాపు అందరికీ, ఈ కంపెనీ ప్రారంభించిన వారు ధీరూభాయ్ అంబానీ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ధీరూభాయ్ అంబానీ అసలు పేరు ఏమిటో.. బహుశా చాలా తక్కువమందికే తెలిసి ఉంటుంది. ఈ కథనంలో ఆ విషయం తెలుసుకుందాం.సాధారణ కుటుంబంలో జన్మించిన ధీరూభాయ్ అంబానీ.. ఆర్థిక పరిస్థితుల కారణంగా, చదువును అర్థాంతరంగా నిలిపివేసి యెమెన్‌కు వెళ్లి అక్కడ పెట్రోల్ పంప్‌లో రూ. 300 జీతానికి పనిచేయడం మొదలుపెట్టారు. కొన్నేళ్ల తరువాత సొంతంగా ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో ఇండియాకు వచ్చి.. ముంబైలోని అద్దె ఇంట్లో రిలయన్స్ ప్రయాణాన్ని ప్రారంభించారు. వస్త్రాల వ్యాపారంతో మొదలైన ఈయన ప్రయాణం.. ఆ తరువాత పెట్రోకెమికల్స్, టెలికాం మొదలైన రంగాలవైపు సాగింది. ఆ తరువాత రిలయన్స్ ఓ పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా మారింది. అందరూ ఈయనను 'ధీరూభాయ్ అంబానీ' అని పిలుచుకునే వారు. కానీ ధీరూభాయ్ అనేది ఆయన ముద్దుపేరు, అంబానీ అనేది ఇంటిపేరు. ధీరూభాయ్ అంబానీ అసలు పేరు.. 'ధీరజ్‌లాల్ హీరాలాల్ అంబానీ' (Dhirajlal Hirachand Ambani). 1932 డిసెంబర్ 28న జన్మించిన ఈయన.. ఏడుపదుల వయసులో 2002 జులై 6న మరణించారు. అప్పటికే రిలయన్స్ సామ్రాజ్యాన్ని దశదిశలా వ్యాపింపజేశారు. ఆయన మరణించే సమయానికి, ప్రపంచంలో 138వ ధనవంతుడిగా ఉన్నట్లు.. ఆయన వ్యక్తిగత నికర విలువ 2.9 బిలియన్ డాలర్లు (నేటి భారత కరెన్సీ ప్రకారం రూ. 24000 కోట్లు) అని సమాచారం.

## బెర్క్‌షైర్ హాత్‌వేను వీడనున్న వారెన్ బఫెట్: నెక్స్ట్ సీఈఓ ఎవరంటే?



శనివారం (2025 మే 3) జరిగిన బెర్క్‌షైర్ హాత్వే వార్షిక సమావేశంలో.. దిగ్గజ ఇన్వెస్టర్ 'వారెన్ బఫెట్' ఊహించని ప్రకటన చేశారు. తాను 2025 చివరి నాటికి కంపెనీ సీఈఓ పదవి నుంచి వైదొలగనున్నట్లు, తరువాత 'హువర్డ్ బఫెట్' కంపెనీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. గ్రెగ్ అబెల్ సంస్థ సీఈఓగా ఉంటారని అన్నారు. బెర్క్‌షైర్ హాత్వే సీఈఓగా గ్రెగ్ అబెల్ పేరును ప్రస్తావించగానే.. గ్రెగ్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే.. గ్రెగ్‌ను సీఈఓగా నియమించాలనే నిర్ణయం తన కుటుంసభ్యులకు తప్ప, గ్రెగ్‌కు కూడా తెలియవని బఫెట్ పేర్కొన్నారు. కంపెనీని నడిపించడానికి.. రెండు దశాబ్దాలుగా సంస్థలో పనిచేస్తున్న గ్రెగ్ అబెల్ సరైన వ్యక్తి అని కొందరు భావించినప్పటికీ.. పెట్టుబడుల విషయంలో ఈయన ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే అనుమానం వ్యక్తం చేశారు. దీనికి బఫెట్ సమాధానమిస్తూ.. గ్రెగ్ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. కాబట్టి నా సంపద మొత్తానికి కంపెనీలో పెట్టుబడిగా పెడతానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా.. నా సారథ్యంలో కంటే.. గ్రెగ్ సారథ్యంలో కంపెనీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన బఫెట్ స్పష్టం చేశారు.62 ఏళ్ల గ్రెగ్ అబెల్.. రెండు దశాబ్దాలకు పైగా బెర్క్‌షైర్‌లో కీలక వ్యక్తిగా ఉన్నారు. ఆల్బెర్టాలోని ఎడ్మంటన్‌లో జన్మించిన అబెల్ చిన్నప్పుడు బాటిల్స్ సేకరించడం, అగ్నిమాపక యంత్రాలను సర్వీసింగ్ చేయడం వంటి ఉద్యోగాలు చేశారు. ఆ సమయంలో ఉన్నతమైన విలువలను పొందారు. 1984లో ఆల్బెర్టా యూనివర్సిటీ ఉన్నత చదువులు చదివారు. బెర్క్‌షైర్ హాత్వేలో చేరిన తరువాత దినదినాభివృద్ధి చెందిన.. కీలకమైన పదవులను అలంకరించారు. ఇప్పుడు ఈయనను సీఈఓ పదవి వరించింది.

## మరిన్ని కంపెనీలు కొంటాం



### ప్రముఖ సీఈవో

**న్యూఢిల్లీ:** వేల్యుయేషన్ సముచితంగా ఉంటే మరిన్ని కంపెనీలను కొనుగోలు చేస్తామని 'యూనికామర్స్ ఈసొల్యూషన్స్' సీఈవో కపిల్ మఖీజా తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ-కామర్స్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకున్నాయని, ఆమ్నిచానల్‌లాంటి కొత్త మోడల్స్ తెరపైకి వచ్చాయని ఆయన చెప్పారు. కంపెనీ ఇటీవలే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం షిప్‌వేను కొనుగోలు చేసిన నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూనికామర్స్ ప్రస్తుతం 7,000 పైచిలుకు వ్యాపారాలకు సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఈ-కామర్స్ వ్యవస్థలో కస్టమర్లతో సంప్రదింపుల దశ, లావాదేవీలను ప్రాసెస్ చేసే దశ, ఆర్డరును పూర్తి చేసే దశ అని మూడు దశలు ఉంటాయని, తమ సంస్థ ఈ మూడు అంశాల్లోనూ సర్వీసులు అందిస్తోందని కపిల్ వివరించారు. తాము ఇప్పటికే భారత్ కాకుండా ఆరు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, మరింతగా విస్తరించే యోచనలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## ఇవన్నీ ఉంటే అయిపోదా.. స్మార్ట్ కిచెన్

**ఇంటి ఆరోగ్యం, ఆనందం అంతా ఉండేది వంటగదిలోనే.. మరి అలాంటి వంటగదిని ఇప్పుడు మరింత స్మార్ట్‌గా మార్చేయాలంటే.. ఇలాంటి గ్యాడ్జెట్స్ (కిచెన్ టీవీ, పిజ్జా ఓవెన్, ఎకోజీ స్మార్ట్ నగ్గెట్ ఐస్ మేకర్, థర్మా 'మీట్'ర్) ఉండాల్సిందే!. ఈ గ్యాడ్జెట్స్ గురించి మరిన్ని వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.**



### కిచెన్ టీవీ

'వంట చేయడం పెద్ద పనేం కాదు' అని చేయి తిరిగిన నిపుణులు చెబుతుంటారు. కానీ, ఇప్పుడు ఇదే మాటను వంట రాని వారు కూడా చెప్పగలరు. వాళ్ల వంటగదిలో ఈ 'జీఈ కిచెన్ క్లబ్' ఉంటే చాలు. ఇదొక స్మార్ట్ టీవీ లాంటిది. 27 అంగుళాల డిస్‌ప్లేతో వస్తుంది. వంటగదిలో దీనిని అమర్చుకుంటే, మనకు కావాల్సిన వంటను ఎలా వండాలో, ఏంమేం కావాలో, ఎంత మోతాదులో వేయాలో ఎప్పటికప్పుడు చూపిస్తూ, తెలియజేస్తుంది. మొబైల్, ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేసుకొని కూడా వాడుకోవచ్చు. ధర 999 డాలర్లు (రూ. 85,301).

### పిజ్జా ఓవెన్

ఆర్డర్ చేసిన అరగంటలో వచ్చే పిజ్జాను వెంటనే తినేయాలి, చల్లారితే అసలు బాగోదు. ఇంట్లో ఉంటే, వెంటనే ఓవెన్‌లో పెట్టి వేడి చేసుకొని తింటాం. అదే బయట ఉంటే.. సాధ్యం కాని పని. ఇందుకోసం ఈ 'ఓనీ కోడా 2 పిజ్జా ఓ□□న్' బాగా ఉపయోగపడుతుంది. ఇదొక గ్యాస్ పవర్డ్ పిజ్జా ఓవెన్. కేవలం పిజ్జాను మాత్రమే ఇందులో వేడి చేసుకొని తినొచ్చు. దీనిని ఎక్కడికైనా తీసుకొని వెళ్లవచ్చు. విహార యాత్రలకు ఇది బాగా ఉపయోగపడుతుంది. ధర 449 డాలర్లు ( రూ. 38,338).

### ఎకోజీ స్మార్ట్ నగ్గెట్ ఐస్ మేకర్

ఫ్రిజ్‌లో ఐస్‌క్యూబ్స్ తయారు చేసుకోవాలంటే కాస్త సమయం పడుతుంది. అదే ఈ 'ఎకోజీ స్మార్ట్ నగ్గెట్ ఐస్ మేకర్' సాయంతో చాలా త్వరగా ఐస్ క్యూబ్స్ తయారు చేసుకోవచ్చు. ఇందులోని ట్రేలో నీరు నింపేసి పెడితే, కేవలం పన్నెండు నిమిషాల్లోనే ఐస్ క్యూబ్స్ తయారవుతాయి. బ్యాటరీతో పనిచేస్తుంది. ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే, ఇరవై నాలుగు గంటల వరకు నిరాటంకంగా పనిచేస్తుంది. యాప్ ద్వారా కూడా ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేసుకోవచ్చు. దీని ధర 239 డాలర్లు (రూ. 20, 407) మాత్రమే!

### థర్మా 'మీట్'ర్

సరిగ్గా ఉడకని మాంసం, పచ్చి మాంసం తినటం వలన శరీరంలోకి టేప్ వార్మ్‌లు వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే, మాంసం సరిగ్గా ఉడికిందా లేదా అని తెలుసుకోవడానికి రూపొందించినదే ఈ 'మీట్'ర్ ప్లస్'. దీనికున్న సూదికొనను మాంసానికి గుచ్చితే, కేవలం పది సెకండ్లలోనే మాంసం ఎంత వరకు ఉడికిందో పూర్తి సమాచారం ఇస్తుంది. మాంసం లోపలి ఉష్ణోగ్రతను సుమారు 212 డిగ్రీ ఫారన్‌హీట్ వరకు, బయటి ఉష్ణోగ్రతను 527 డిగ్రీ ఫారన్‌హీట్ వరకు చెప్పగలదు. బ్లూటూత్ కెనెక్టివిటీతో మొబైల్‌కు కూడా కనెక్ట్ చేసుకొని వాడుకోవచ్చు. ధర 99 డాలర్లు (రూ. 8,543).

## మాకు కావాల్సింది భాగస్వాములు.. బోధకులు కాదు: జై శంకర్



**న్యూఢిల్లీ:** యూరోపియన్ దేశాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ధ్వజమెత్తారు జైశంంకర్. యూరోపియన్ దేశాలు భారత భౌగోళిక రాజకీయ వైఖరిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయంటూ విమర్శలు చేశారు. భారతదేశానికి భాగస్వాములు కావాలని, అంతే కానీ బోధకులు అవసరం లేదని చురకలంటిచారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో జరిగిన ఆర్కిటిక్ సర్కిల్ ఇండియా ఫోరం సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐస్లాండ్ మాజీ అధ్యక్షుడు గ్రిమ్సన్ తదితరులతో జరిగిన చర్చావేదికలో యూరప్ తీరును జైశంకర్ బహిర్గతం చేశారు. యూరప్ దేశాల నుంచి భారత్ ఏం కోరుకుంటుదని అడిగిన ప్రశ్నలో భాగంగా జైశంకర్ఇలా సమాధానమిచ్చారు. 'మనం ప్రపంచాన్ని చూసినప్పుడు, భాగస్వాముల కోసం చూస్తాం. ముఖ్యంగా కొన్ని విదేశాలు చాలా బోధనలు చేస్తారు, వాటిని సొంత దేశంలో ఆచరించరు. కొన్ని యూరప్ దేశాలు ఇప్పటికీ ఈ సమస్యతో పోరాడుతున్నాయని నేను నమ్ముతున్నాను' అని అన్నారు. ఇప్పుడు యూరప్ దేశాలు వాస్తవిక వైపు అడుగులు వేయగలరా లేదా అనేది చూడాలి. మనం భాగస్వామ్యాన్ని చేసుకోవాలంటే, కొంత అవగాహన ఉండాలి, కొంత సున్నితత్వం ఉండాలి, పరస్పర ప్రయోజనాల పట్ల అవగాహ ఉండాలి, ప్రపంచం ఎలా పనిచేస్తుందో గ్రహించాలి, ఈ విషయంలో కొన్ని యూరప్ దేశాలు సమర్థవంతంగా ఉండగా, మరికొన్ని వెనుకబడి ఉన్నాయన్నారు. గతంలో కూడా యూరప్ దేశాల తీరుపై జైశంకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి సమస్యల్ని ప్రపంచ సమస్యలుగా చూపిస్తారని, ప్రపంచ సమస్యల్ని మాత్రం వారు పట్టించుకోరంటూ వ్యాఖ్యలు చేశారు.

## ట్రంప్ సుంకాలకు..బ్రష్ దెబ్బ..!



అమెరికా-చైనా సుంకాల యుద్ధం ఇప్పుడు టాయిలెట్‌కి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖంతో తయారు చేసిన పసుపు కుచ్చు టాయిలెట్ బ్రష్ చైనాలో వైరల్‌గా మారింది. ఈ బ్రష్ కుచ్చు అచ్చం ట్రంప్ జుట్టు మాదిరిగానే ఉంటుంది. చైనా ఉత్పత్తులపై అమెరికా విధించిన భారీ సుంకాలకు ప్రతీకారంగా చైనీయులు 'యివు కౌంటర్‌టాక్' అంటూ ఇలా టాయిలెట్ బ్రష్‌లతో వ్యంగ్యంగా బదులిస్తున్నారు. వీటిని మార్కెట్‌లో రూ.160 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. ట్రంప్ మీద చైనా ప్రజల కోపతాపాలు పెరిగినట్లుగానే, ప్రస్తుతం వీటికి గిరాకీ భారీగా పెరిగింది. చాలా స్టోర్స్‌లలో వీటికి 'ఔటాఫ్ స్టాక్' బోర్డులు పెట్టేస్తున్నారు. అంతేకాదు, సోషల్ మీడియాలోనూ 'బ్రష్‌ట్రంప్' హ్యాష్ టాగ్ ట్రెండ్ అవుతోంది. మరెంతోమంది ఈ ట్రంప్ బ్రష్‌లను ఉపయోగించి, వివిధ ఫన్నీ మీమ్స్, కామెంట్లతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. ఏదీ ఏమైనా, మొత్తానికి చిన్నదైనా ఈ టాయిలెట్ బ్రష్ విసిరిన పొలిటికల్ పంచ్ భారీగానే ఉంది కదూ!

## మీరు యుద్ధంలో పాల్గొంటారా?.. లేదు.. ఇంగ్లండ్ పారిపోతా: పాక్ ఎంపీ



**కరాచీ:** తమపై భారత్ యుద్ధానికి దిగితే ఏంటనే పరిస్థితి ఇప్పుడు పాకిస్తాన్ లో కనిపిస్తోంది. భారత్ తో పోరాడే పూర్తి శక్తి సామర్థ్యాలు ఏ రకంగా చూసే పాక్ కు లేవు. పైకి ఏదో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ నిజంగా భారత్ యుద్ధానికి దిగితే మాత్రం తమకు చుక్కలే కనిపిస్తాయనే భావన కొందరి నాయకుల్లో కనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఒక పాక్ ఎంపీ చేసిన వ్యాఖ్యలే అందుకు ఉదాహరణ. ఒకవేళ తమతో భారత్ యుద్ధానికి దిగితే తాను ఇంగ్లండ్‌కు పారిపోతానంటూ చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఆ ఎంపీ సరదాగా చేసినా సీరియస్ గా ఈ వ్యాఖ్యలు చేసినా ప్రస్తుత పాకిస్తాన్ ప్రభుత్వాన్ని చేతగాని ప్రభుత్వంగానేఅభివర్ణించినట్లు ఆయన మాటల్లో కనబడుతోంది. పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీకి చెందిన ఎంపీ షెర్ అఫ్జల్ ఖాన్ మర్వాత్.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక లోకల్ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సదరు ఎంపీ ఈ కామెంట్స్ చేశారు. పాక్ పై భారత్ యుద్ధానికి దిగితే మాత్రం తాను ఇంగ్లండ్ వెళ్లిపోతానంటూ తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోదీని వెనక్కి తగ్గమని చెప్పొచ్చు కదా.. అని అడిగిన మరో ప్రశ్నకు 'నేను చెబితే వినడానికి.. మోదీ జీ ఏమైనా మా బంధువా.? అంటూ చమత్కరించారు ఎంపీ షెర్ అఫ్జల్ ఖాన్ మర్వాత్. ప్రస్తుతం పాక్ జైల్లో ఉన్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఒకప్పుడు అత్యంత సన్నిహితంగా ఉండేవారు ఎంపీ షెర్ అఫ్జల్ ఖాన్. పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్(పీటీఐ) తరఫున ఆయన ఎంపీగా ఉన్నారు. గతంలో అంటే ఇమ్రాన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ఎంపీ హవా నడిచేది. పీటీఐలో కీలకంగా వ్యవహరించేవారు షెర్ అఫ్జల్ ఖాన్,. గత కొన్నినెలలుగా ప్రస్తుత పాకిస్తాన్ ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు అఫ్జల్ ఖాన్,. ఈ క్రమంలోనే భారత్ తో యుద్ధాన్ని పాక్ తట్టుకోలేదనే సంకేతం వచ్చేలా వ్యాఖ్యలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారు ఎంపీ అఫ్జల్ ఖాన్.



# తెలుగు హీరోతో మృణాల్ ప్రేమ? నిజమేంటి?

మృణాల్ ఠాకుర్(Mrunal Thakur).. ఈ పేరు చెప్పగానే 'సీతారామం', 'హాయ్ నాన్న' సినిమాలే గుర్తొస్తాయి. చేసింది కొన్ని చిత్రాలే అయినా తెలుగులో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ప్రస్తుతానికైతే హిందీలో బిజీగా ఉంది. అలాంటిది ఇప్పుడు ఈమె ఓ తెలుగు హీరోతో ప్రేమలో ఉందని అంటున్నారు. ఇంతకీ నిజమేంటి? మృణాల్ తొలి తెలుగు సినిమా 'సీతారామం'లో అక్కినేని హీరో సుమంత్(Sumanth) కూడా నెగిటివ్ టచ్ ఉన్న పాత్ర చేశాడు. మరి ఈ మూవీ తర్వాత వీళ్లిద్దరి పరిచయం కాస్త ప్రేమ వరకు వెళ్లిందని అంటున్నారు. అందుకు తగ్గట్లే గత రెండు మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇద్దరు కలిసి ఫొటో కూడా ఒకటి వైరల్ అవుతుంది. మరి అంతటా వినిపిస్తున్నట్లు నిజంగా మృణాల్, సుమంత ప్రేమలో ఉన్నారా అంటే చెప్పడం కష్టం. ఎందుకంటే ఒక్క ఫొటోలో కాస్త చనువుగా ఉన్నంత మాత్రాన అదే ప్రేమ అని చెప్పలేం. మరోవైపు కెరీర్ పరంగా బిజీ ఉన్న మృణాల్.. ఇప్పుడు పెళ్లి చేసుకుంటుందా అనేది సందేహమే. కాబట్టి ఇవన్నీ ఒట్టి పుకార్లు మాత్రమే అనిపిస్తుంది. గతంలో సుమంత్.. హీరోయిన్ కీర్తిరెడ్డిని పెళ్లి చేసుకున్నాడు. కానీ రెండేళ్లకే వీళ్లిద్దరూ విడిపోయారు. అప్పటినుంచి సుమంత్ సింగిల్ గానే ఉంటున్నారు. ప్రస్తుతం అప్పుడప్పుడు ఒకటి అరా సినిమాలు చేస్తున్నాడు. అయితే మృణాల్ ఠాకుర్ తో ప్రేమ, పెళ్లి అంటూ వస్తున్న పుకార్లకు ఇతడి నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి?



# మరో కాంతార లాంటి సినిమా..
## తెలుగు టీజర్ వచ్చేసింది!

కేజీఎఫ్, సలార్ వంటి యాక్షన్ చిత్రాలతో సంగీత దర్శకుడిగా సంచలనం సృష్టించిన రవి బస్రూర్. ఆ తర్వాత వీర చంద్రహాస చిత్రంతో దర్శకుడిగా తన సత్తా చాటారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రంలో శిథిల్ శెట్టి, నాగశ్రీ జివిస్, ప్రసన్న శెట్టిగార్, ఉదయ్ కడబాల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ఎస్ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం, ఏప్రిల్ 18న కన్నడలో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలోనే వీర చంద్రహాస మూవీ తెలుగు టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. యక్షగానం ఇతివృత్తం ఆధారంగా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. కాగా.. కన్నడలో సూపర్ హిట్ కావడంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ విడుదల చేయనున్నారు. గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద', ప్రజ్వల్ దేవరాజ్ నటించిన రాక్షస చిత్రాలను తెలుగులో విజయవంతంగా రిలీజ్ చేశారు. తాజాగా వీర చంద్రహాస మూవీ రైట్స్‌ను ఆయనే సొంతం చేసుకున్నారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. కన్నడలో సూపర్ హిట్ అయినా ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను ఎంతవరకు అలరిస్తుందో వేచి చూడాల్సిందే.



# అమెరికాలో రానా సందడి..
## హాలీవుడ్ దిగ్గజాలతో భేటీ!

టాలీవుడ్ హీరో రానా నాయుడు యూఎస్‌లో సందడి చేశారు. ఇటీవల డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లింగ్ మేనియాలోనూ కనిపించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న రానా మియామి గ్రాండ్ ప్రిక్స్ వీకెండ్ ఈవెంట్‌కు హాజరయ్యారు. అక్కడే హాలీవుడ్‌లో ప్రముఖ సంగీత దిగ్గజాలైన 50 సెంట్, ఆస్కార్ విజేత అయిన గూడింగ్ జూనియర్‌తో ముచ్చటించారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండియాకు చెందిన లోకా లోకా పార్టీ సంస్థ ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు రానా హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే లోకా లోకా సంస్థకు సహా వ్యవస్థాపకుల్లో ఒకరైన రానా దగ్గుబాటి ఈవెంట్‌లో సందడి చేశారు. ఈ కంపెనీకి హర్ష వడ్లమూడి, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కలిసి ముగ్గురు ఈ సంస్థకు కో ఓనర్స్‌గా ఉన్నారు. అమెరికా మార్కెట్లో తమ సంస్థ విస్తరణ కోసమే రానా అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. రానా చొరవతో అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ లైఫ్ స్టైల్ బ్రాండ్‌గా లోకా లోకా సంస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా వ్యాపారం, వినోదం, క్రీడల ప్రపంచానికి నిలయమైన మియామిలో రానా దగ్గుబాటి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు.



# క్రీడా వార్తలు
## SPORTS NEWS

# లక్నోపై సూపర్ విక్టరీ.. ప్లే ఆఫ్స్‌కు చేరువలో పంజాబ్



ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ మరో అద్భుత విజయం నమోదు చేసింది. ఈ మెగా టోర్నీలో భాగంగా ధర్మశాల వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 37 పరుగుల తేడాతో పంజాబ్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 236 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. లక్నో బౌలర్లను పంజాబ్ బ్యాటర్లు ఊతికారేశారు. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రభ్‌సిమ్రాన్ సింగ్(91) టాప్ స్కోరర్‌గా నిలవగా.. శ్రేయస్ అయ్యర్(45), శశాంక్ సింగ్(33), ఇంగ్లిష్(30) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. లక్నో బౌలర్లలో ఆకాష్ మహారాజ్ సింగ్, దిగ్వేష్ సింగ్ తలా రెండు వికెట్లు సాధించారు.

### బదోని ఒక్కడే..

అనంతరం 236 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 199 పరుగులు మాత్రమే చేయగల్గింది. లక్నో బ్యాటర్లలో అయూష్ బదోని(74) ఒంటరి పోరాటం చేయగా.. అబ్దుల్ సమద్(45) పర్వాలేదన్పించాడు. మిగితా బ్యాటర్లంతా చేతులేత్తేశారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా.. ఒమర్జాయ్ రెండు, జాన్సెన్, చాహల్ తలా వికెట్ సాధించారు. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. ప్లే ఆఫ్స్‌కు ఆర్హత సాధించేందుకు కింగ్స్ అడుగు దూరంలో నిలిచారు.



# చరిత్ర సృష్టించిన రియాన్ పరాగ్

ఐపీఎల్ 2025లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠపోరులో ఒక్క పరుగు తేడాతో రాజస్తాన్ రాయల్స్ ఓటమి పాలైంది. 207 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్.. ఆఖరి బంతి వరకు పోరాడింది. చివరి ఓవర్‌లో రాజస్తాన్ రాయల్స్ విజయానికి 22 పరుగులు అవసరమవ్వగా.. శుభమ్ దూబే వరుసగా బౌండరీలు బాది గెలుపునకు చేరువ చేశాడు. కానీ ఆఖరి బంతికి నాన్‌స్ట్రైక్‌లో జోఫ్రా అర రనౌట్ కావడంతో రాజస్తాన్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అయితే ఈ మ్యాచ్‌లో రాయల్స్ ఓటమి పాలైనప్పటికి.. ఆ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ తన అద్భుత ఇన్నింగ్స్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. ఓ దశలో రాజస్తాన్‌ను ఈజీగా గెలిపించేలా కన్పించిన పరాగ్.. కీలక సమయంలో ఔట్ కావడంతో మ్యాచ్ ఫలితం తారుమారైంది. పరాగ్ తృటిలో తొలి ఐపీఎల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 45 బంతులు ఎదుర్కొన్న పరాగ్.. 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో పరాగ్ వరుస ఆరు సిక్సర్లు బాది సంచలనం సృష్టించాడు. రాజస్తాన్ ఇన్నింగ్స్ 13వ ఓవర్ వేసిన స్పిన్నర్ మోయిన్ అలీ బౌలింగ్‌లో తొలి బంతికి షిమ్రన్ హెట్‌మెయిర్ సింగిల్ తీసి పరాగ్‌కు స్ట్రైక్ ఇచ్చాడు.

ఆ తర్వాతి ఐదు బంతులను రియాన్ సిక్సర్లుగా మలిచాడు. ఆ తర్వాత 14 ఓవర్ తొలి బంతికి ఓ పరుగు తీసి మళ్లీ పరాగ్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. పరాగ్ ఆ బంతిని కూడా స్టాండ్స్‌లోకి పంపించాడు. దీంతో వరుసగా తను ఎదర్కొన్న ఆరు బంతులను సిక్సర్లుగా మలిచాడు. ఈ క్రమంలో ఐపీఎల్‌లో వరుసగా ఆరు సిక్స్‌లు బాదిన తొలి ప్లేయర్‌గా పరాగ్ రికార్డులకెక్కాడు.

# క్రిస్ గేల్, కేఎల్ రాహుల్ సరసన ప్రభ్‌సిమ్రన్ సింగ్



లక్నో సూపర్ జెయింట్స్ (PBKS vs LSG)తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (Prabhsimran Singh) పరుగుల వరద పారించాడు. ప్రత్యర్థి జట్టు బౌలింగ్‌ను చితక్కొడుతూ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అయితే, దురదృష్ట వశాత్తూ శతకానికి తొమ్మిది పరుగుల దూరంలో ప్రభ్‌సిమ్రన్ ఆగిపోయాడు. అయితేనేం.. ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. తన అద్భుత ఆట తీరుతో క్రిస్ గేల్, కేఎల్ రాహుల్ (KL Rahul) సరసన నిలిచాడు. గతేడాది నిలకడైన ప్రదర్శన కనబరిచిన ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ను పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు భారీ ధరకు అట్టిపెట్టుకుంది. అతడి కోసం పర్సు నుంచి నాలుగు కోట్ల రూపాయలు వెచ్చించింది. అందుకు తగ్గట్లుగానే ప్రభ్‌సిమ్రన్ ఈసారీ పైసా వసూల్ ప్రదర్శన ఇస్తున్నాడు. మెరుపు బ్యాటింగ్‌తో అలరిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా లక్నోతో మ్యాచ్‌లోనూ అతడు బ్యాట్ ఝులిపించాడు. మొత్తంగా 48 బంతుల్లో ఆరు ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 91 పరుగులు సాధించాడు. అయితే, దిగ్వేశ్ రాఠీ బౌలింగ్‌లో నికోలస్ పూరన్‌కు క్యాచ్ ఇవ్వడంతో ప్రభ్‌సిమ్రన్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఇక అతడికి ఈ సీజన్‌లో ఇది ఓపెనర్‌గా వరుసగా మూడో అర్ధ శతకం కావడం విశేషం. తద్వారా పంజాబ్ కింగ్స్ తరఫున ఒకే సీజన్‌లో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో ప్రభ్‌సిమ్రన్ చేరిపోయాడు. ఇక ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ ఇప్పటికి పది మ్యాచ్‌లు పూర్తి చేసుకుని ఆరు గెలిచింది. ఒకటి వర్షం కారణంగా రద్దైంది. ఈ క్రమంలో 13 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. తాజాగా లక్నోతో మ్యాచ్‌లోనూ గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో మరింత ముందుకు దూసుకుపోతుంది. మరోవైపు.. ఈ సీజన్‌లో ఇప్పటికి (ఈ మ్యాచ్‌తో కలిపి) పదకొండు ఇన్నింగ్స్ ఆడిన ప్రభ్‌సిమ్రన్ 437 పరుగులు సాధించాడు. తద్వారా పంజాబ్ కింగ్స్ తరఫున అత్యధిక పరుగుల వీరుడిగా కొనసాగుతున్నాడు. అతడి ఖాతాలో ఇప్పటికి నాలుగు అర్ధ శతకాలు ఉన్నాయి. ఇక లక్నోతో ఆదివారం నాటి మ్యాచ్‌లో పంజాబ్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు మాత్రమే నష్టపోయి 236 పరుగుల మేర భారీ స్కోరు సాధించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో పాటు జోష్ ఇంగ్లిస్ (14 బంతుల్లో 30), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25 బంతుల్లో 45), శశాంక్ సింగ్ (15 బంతుల్లో 33 నాటౌట్), మార్కస్ స్టొయినిస్ (5 బంతుల్లో 15) దంచికొట్టారు.

ఒక సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఓపెనర్‌గా వరుసగా అత్యధిక అర్ధ శతకాలు సాధించింది వీరే

క్రిస్ గేల్ (2018) మూడు
కేఎల్ రాహుల్ (2018) మూడు
కేఎల్ రాహుల్ (2019) మూడు
కేఎల్ రాహుల్ (2020) మూడు
ప్రభ్‌సిమ్రన్ సింగ్ (2025*) మూడు.



# బంగ్లాదేశ్ కెప్టెన్‌గా లిట్టన్ కుమార్ దాస్..

పాకిస్తాన్, యూఏఈలతో టీ20 సిరీస్‌కు 16 మంది సభ్యులతో కూడిన తమ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ సిరీస్‌లకు బంగ్లాదేశ్ కెప్టెన్‌గా వికెట్ కీపర్ బ్యాటర్ లిట్టన్ కుమార్ దాస్ ఎంపికయ్యాడు. టీమిండియాతో టీ20 సిరీస్ అనంతరం బంగ్లా టీ20 కెప్టెన్సీకి నజ్ముల్ హొస్సేన్ శాంటో రాజీనామా చేశాడు. ఈ క్రమంలోనే తమ టీ20 జట్టు కెప్టెన్‌గా లిట్టన్ కుమార్ దాస్‌ను బంగ్లా క్రికెట్ బోర్డు నియమించింది. ఈ సిరీస్‌లలో లిట్టన్ దాస్ సారథిగా తనను తాను నిరూపించుకుంటే ఫుల్ టైమ్‌గా కెప్టెన్‌గా కొనసాగించే అవకాశముంది. అయితే ఈ సిరీస్‌లకు స్టార్ ఆల్‌రౌండర్ మెహదీ హసన్ మిరాజ్‌కు సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు. అయితే మాజీ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటోతో పాటు యువ ఆటగాళ్లు షమీమ్ హొస్సేన్, జాకర్ అలీ అనిక్, రిషాద్ హొస్సేన్‌లకు సెలక్టర్లు చోటిచ్చారు. బంగ్లా జట్టు తొలుత యూఏఈతో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు మే 17, మే 19 తేదీలలో షార్జాలో జరగనున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com